www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

గురువారం, 23.05.2024, హైదరాబాద్ | తెలుగు దిన పత్రిక | సంపుటి: 2, సంచిక: 222







# జాగ్రత్త.. మీ ప్రసంగాలు గాడి తప్పుతున్నాయి

- ప్రచారాల్లో కుల, మత ప్రస్తావనలపై ఆగ్రహం
- అగ్ర నేతల ప్రచారాలపై ఈసీ ఆగ్రహం





**ముందడుగు జాతీయం:**
దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలతో విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో అగ్ర నేతలు, ముఖ్య ప్రచారకర్తలు చేసే ప్రసంగాలు గాడి తప్పుతున్నాయంటూ ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ప్రచారాల్లో కుల, మత ప్రస్తావనలను తీసుకురావడంపైనా విరుచుకుపడింది. నేతల ప్రచారశైలిలో మార్పు రావడం లేదని, ఇకనైనా సరిదిద్దుకోవాలని పేర్కొంటూ భాజపా, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులకు నోటీసులుజారీ చేసింది. ఎన్నికల ప్రచారాల్లో మతపరమైన అంశాలకు దూరంగా ఉండాలని భాజపా, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల సంఘం సూచించింది. ముఖ్యంగా సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలను వెంటనే ఆపాలని భాజపాకు స్పష్టం చేసింది. రాజ్యాంగం రద్దవుతుందనే తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రకటనలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్‌ను ఆదేశించింది. అగ్నివీర్ వంటి పథకాలపై ప్రసంగాలు చేసేటప్పుడు.. సాయుధ బలగాలను రాజకీయం చేయవద్దని పేర్కొంది. భాజపా, కాంగ్రెస్‌లు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, వాటిని సమర్థించుకోవడాన్ని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ మరింత బాధ్యతగా వ్యవహరించాలన్న ఈసీ.. ప్రతిపక్ష పార్టీకి ఈ విషయంలో మినహాయింపు లేదని పేర్కొంది. ఎన్నికల వ్యవస్థపై భారత ఓటరుకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఈసీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదని స్పష్టంచేసింది. ఈ క్రమంలోనే ప్రచారాల్లో సంయమనం పాటించి, ప్రసంగాలను సరిచేసుకునేలా స్టార్ క్యాంపెయినర్లకు సూచించుకోవాలని రెండు జాతీయ పార్టీలకు ఈసీ సూచించింది.



www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

గురువారం, 23.05.2024, హైదరాబాద్ | తెలుగు దిన పత్రిక | సంపుటి: 2, సంచిక: 222








## పోచమ్మ దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- **ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డి**

**వనపర్తి విశాల భారతి:** పోచమ్మ తల్లి దీవెనలతో నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డి అన్నారు. బుధవారం కాశీంనగర్ గ్రామంలో పోచమ్మ పండుగ వేడుకల్లో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం పెద్ద పీట వేసిందని, వారందరూ రాజకీయ చైతన్యంలో భాగస్వాములు కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ మమేకమై అధికారాన్ని కట్టబెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్ రెడ్డి, హనుమంతు, దివాకర్ యాదవ్, దిలీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





## భూసార పరీక్షల ఉపయోగం పై అవగాహన

**చిగురుమామిడి, విశాల భారతి** చిగురుమామిడి మండలంలోని నవాబుపేట గ్రామంలో గ్రామ రైతులకు డబ్ల్యూడబ్ల్యూ ఎఫ్ నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారి బి. సి. ఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ రైతులతో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త యన్. రమేష్ మాట్లాడుతూ రైతులు ఈ వేసవిలో తప్పకుండ భూసార (మట్టి )పరీక్షలు చేయించుకోవాలని, వాటిలో వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని, దీని వల్ల ఎరువుల వినియోగం అవసరం ఉన్నంత వరకే వాడడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి నేల కాలుష్యం తగ్గుతుంది. రైతులు ఈ వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి, పశువుల పెంటలు, చెరువు మట్టి వేసుకోవాలని , మందలు పెట్టించు కోవాలని.. పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము పిల్లిపెసర, నవధాన్యాలు మొదలగునవి చల్లుకొని పూత దశలో వాటిని కలియదున్నుకోవడం మరియు పత్తి, మొక్కజొన్న వ్యర్థాలను కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలపడం జరిగింది. భూసార పరీక్షల కోసం రైతులు తీసుకొని వచ్చిన మట్టిని రైతుల సమక్షంలో పరీక్షలు చేసి రైతులందరికి పరీక్షల ఫలితాలు వెంటనే ఇచ్చి అన్ని వివరాలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్షేత్ర సిబ్బంది జితేందరరెడ్డి, శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

- **దబ్బటి శేఖర్**



**చౌటుప్పల్, విశాలభారతి:** సమాచార హక్కు రక్షణ చట్టం 2005 యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దబ్బటి శేఖర్ మాట్లాడుతూ వరంగల్ , ఖమ్మం ,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు మే 27 సోమవారం రోజున జరుగుతున్న సందర్భంగా సమాజంలో అవగాహన ఉన్న వ్యక్తిని నిరుద్యోగుల సమస్యలపై పోరాడే అభ్యర్థిని ఎన్నుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వరంగల్ ,ఖమ్మం ,నల్గొండ జిల్లాల పట్టభద్రులకు దబ్బటి శేఖర్ పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.



## ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ

**సైదాపూర్, విశాల భారతి** మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాలలో 2024 25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుండి దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఫర్హానా తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్ సైట్ ద్వారా ఎంపీసీ,బైపీసీ,సీఈసీ,ఎంఈసి,గ్రూపుల్లో ప్రవేశాల కోసం ఈనెల 25 లోపు ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ప్రవేశం పొందిన బాలికల కోసం ఉచిత హాస్టల్ సౌకర్యం కూడా ఉన్నదన్నారు. పదిలో వచ్చిన మార్కులు ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.



## మట్టి పరీక్షలతో భూమికి బలం

**భీమదేవరపల్లి విశాల భారతి** పంటలు సాగుచేసే రైతులు మేలైన దిగుబడి సాధించాలంటే భూమి సారవంతంగా ఉండాలి. అయితే ఏ భూమిలో ఎంత మేరకు పోష కాలున్నాయనే విషయం భూసార పరీక్షలతోనే తేలిపోతుంది. భూములు ఖాళీగా ఉన్నందున భూసార పరీక్షలకు ఇదే సరైన సమయమని మండలంలోని వంగర గ్రామంలో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ ఇండియా బి సి ఐ ఉత్తమ పత్తి యాజమాన్య నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో భూమి పరీక్షలు నిర్వహించారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ మట్టి నమూనాల సేకరణ, పరీక్షల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త తిరుపతి మాట్లాడుతూ మనుషులకు రక్త పరీక్ష ఏ విధంగానో అదే విధంగా నేల తల్లికి కూడా మట్టి పరీక్ష అంతే అవసరమని అన్నారు. అవసరమైన ఎరువులు వాడితే ఫలితం ఉంటుందని భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలిసిపోతుందని సమస్యాత్మకమైన భూములుంటే వాటిని సవరించుకునే విధానాలు తెలుసుకోవచ్చానరు. ఈ కార్యక్రమంలో బీసీఐ క్షేత్ర సిబ్బంది రమేష్ శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.



## గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు..

- **పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు**

**చిగురుమామిడి, విశాల భారతి** సల్లంగా చూడు పోచమ్మ తల్లో అంటూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను బుధవారం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గౌడ కులస్తులు ప్రతి గడప నుండి బోనాలు తీసుకొని శివసత్తుల పూనకాలు,డప్పు చప్పుల్ల మధ్య గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధి కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా చిన్న పెద్ద తేడా లేకుండా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 23న శ్రీరేణుక ఎల్లమ్మ జాతరలో భాగంగా ఆలయం చుట్టూ బండ్లు తిరుగుట, 24న బోనాల జాతర జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ వేడుకలో గౌడసంఘం అధ్యక్షులు గట్టు మొగిలి, ఆకుల శ్రీనివాస్, కుల సంఘం నాయకులు తీగల శ్రీనివాస్,గట్టు కనకయ్య, బుర్ర రవి, గట్టు జనార్ధన్, సుధగోని శ్రీహరి, బోడిగ మోహన్, మార్క సత్తయ్య, గౌరవ అధ్యక్షుడు బుర్ర పరశురాం గౌడ్,గట్టు రాజయ్య, గట్టు ఎల్లయ్య,గట్టు రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.



## జయరాములు స్మారక సభను విజయవంతం చేయండి

- **అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపు..**

**వనపర్తి విశాల భారతి:** దివంగత మాజీ ఎమ్మెల్యే జయరాములు 39వ వర్ధంతి సందర్భంగా స్మారక సభ ఏర్పాటు చేస్తున్నట్లు , అట్టి సభను విజయవంతం చేయాలని అఖిలపక్షా ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాళ్ళు మాట్లాడారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే జయరాములు బీసీ నినాదంతో ముందుకు నడిచి బుడుగు బలహీన వర్గాలకు ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. ఈనెల 24న దివంగత మాజీ ఎమ్మెల్యే జయరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన ఘాట్ వద్ద నివాళులర్పించాలన్నారు. తదానంతరం ఎం వై ఎస్ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో స్మరక సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్మారక సభకు రాష్ట్ర బీసీ నాయకులు, రాష్ట్ర సామాజిక న్యాయ జెఎసి చైర్మన్ ప్రభంజన్ యాదవ్, బీసీ సమాజ్ ఫౌండర్ సూర్యరావు, లంబాడి హక్కుల పోరాట నాయకులు , జిల్లా నాయకులు, వక్తలు పాల్గొంటున్నారన్నారు. ఈ సమావేశంలో గోపాలకృష్ణ, రమేష్, బొడ్డుపల్లి సతీష్, తదితరులు ఉన్నారు.



## మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు డుమ్మా

**ధర్పల్లి విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సర్వసభ్య సమావేశం ఎంపీపీ నల్ల సారిక రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. కానీ పూర్తిస్థాయిలో ఎంపీటీసీలు హాజరు కాలేదు. అయినప్పటికీ సమావేశం ప్రారంభించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కు నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.అనంతరం మండల స్థాయి అధికారులు గత మూడు నెలల జరిగిన ప్రగతి నివేదికను జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, జరగబోయే అభివృద్ధి గురించి ఆయా శాఖల అధికారులు సమావేశంలో చదివి వినిపించారు. ప్రజా ప్రతినిధులు తమ గ్రామాలలో సమస్యల గురించి వివరణ కోరగా, వాటికి మండల స్థాయి అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ నల్ల సారిక రెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామాలలో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారులు వచ్చి సమీక్షించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ మాలతి,ఎంపీడీవో బాలకృష్ణ, వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్,ఎంపీటీసీలు,ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.




## షిమ్లా పర్యటనలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి:**పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని సిమ్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా షిమ్లా పట్టణంలోని రాష్ట్రపతి వేసవి కాలంలో ఉండేందుకు నిర్మించిన రాష్ట్రపతి నివాస్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీ భవనం, క్రీస్తు చర్చ్, సెయింట్ మైకేల్ క్యాథెడ్రల్ చర్చ్ లను సందర్శించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో పాటు అమీన్ పూర్ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, అమీన్ పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పాండు, మాణిక్ ప్రభు, రాజు ఉన్నారు.



## మహిళా బీడీ కార్మికులను వేధిస్తున్న టేకేదార్ వైకుంఠం

- **తక్షణమే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలి**
- **చార్ భాయ్ కార్ఖానా ఎదుట మహిళ కార్మికుల నిరసన**


**విశాల భారతి, ఇందల్వాయి:** మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో చార్ భాయ్ కార్ఖానాకు సంబంధించిన టేకేదార్ వైకుంఠం మహిళల కార్మికుల పట్ల దూషిస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ, తాను చెప్పిందే వినాలంటూ బెదిరిస్తున్నాడని మహిళలు ఆందోళన చెంది నిరసన చేసి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం చార్ భాయ్ సెంటర్ కార్యాలయాన్ని ముట్టడించారు. టేకేదార్ వైకుంఠం పైన చార్ భాయ్ యాజమాన్యం, ప్రభుత్వం తగిన కఠిన చర్యలు తీసుకొని,మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అలాగే ఈ టేకేదార్ వైకుంఠంను తప్పించి వేరే వ్యక్తిని నియమించాలని వారు వినతిపత్రం సమర్పించారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి మహిళ బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్**

**వనపర్తి విశాల భారతి:**మాదారి భాగ్య రెడ్డి వర్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. భాగ్య రెడ్డి వర్మ 136 వ జయంతి ఉత్సవాలను బుధవారం ఐ.డి.ఓ.సి. ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున అధికారికంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, సంఘ నాయకులు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ.. మాదారి భాగయ్య దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారనీ, విద్య ద్వారానే దళితులు ఆత్మగౌరవం, అభివృద్ధి సాధించగలరనే విశ్వాసంతో హైదారాబాద్ లో దళితుల కోసం 30 పాఠశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. భాగ్యరెడ్డి వర్మ సూచించిన బాటలో పయనించిన జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి నుషిత, జిల్లా అధికారులు, సంఘం నాయకులు గంధం నాగరాజు, గిరిరాజాచారి, టి. వెంకటస్వామి కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గీతంలో పరిశోధనా వ్యాసాలపై కార్యశాల

**పటాన్ చెరు, విశాలభారతి:**గతంలోని పరిశోధకులు విరివిరిగా పరిశోధనా వ్యాసాలు రాసి, వాటిని ప్రచురించేలా ప్రోత్సహించేందుకు గాను ఈనెల 27న ఒకరోజు ఆన్ లైన్ వర్క్ షాప్ ను గీతం నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్ (కేంద్ర గ్రంథాలయం) నిర్వహించనుంది. విద్యాసంబంధ ప్రచురణలు, పరిశోధనలలో విశ్వ వ్యాప్తంగా పేరొందిన విలే దీనిని నిర్వహిస్తుందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో గీతం కేంద్ర గ్రంథాలయ అధికారులు పేర్కొన్నారు. విలే వినియోగదారుల శిక్షణ మేనేజర్ కిమ్ సా ప్రధాన వక్తగా వ్యవహరిస్తారని తెలియజేశారు.గీతమతో అనుబంధంగా ఉన్న పరిశోధకులంతా ఈ ఒకరోజు కార్యశాలలో పాల్గొనవచ్చన్నారు. విలేతో గీతం చేసుకున్న అవగాహన మేరకు, సరిశోధకులు ఎటువంటి ఖర్చు లేకుండా విలే హైబ్రీడ్ జర్నళ్లలో తను పరిశోధనా వ్యాసాలను ప్రచురించవచ్చని తెలిపారు. ఈ కార్యశాలలో పాల్గొనేవారికి తమ వ్యాసాలు ప్రచురించే పద్ధతి, వాటిపై సమీక్ష నాటి ఆమోదం కోసం సమర్పించాల్సిన పత్రాలు వంటి వాటి గురించి మార్గనిర్దేశనం చేస్తారని వివరించారు.ఓపెన్ యాక్సెస్లో (బహిరంగంగా అందుబాటులో ఉండేలా) ప్రచురించడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను, ఇతర అంశాలను కూడా అందులో పాల్గొనే పరిశోధకులకు వివరిస్తారని తెలియజేశారు. ఈ వర్క్ షాప్ ముగింపులో సందేహాల నివృత్తి కోసం చివర్లో తగిన సమయం కేటాయిస్తానున్నారు.ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, ఇతరత్రా వివరాల కోసం గీతం నాలెడ్జ్ సెంటర్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## నిరుపయోగంగా 'చెత్త' రిక్షాలు



**భీమదేవరపల్లి విశాల భారతి** గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల కోసం గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు అందించిన చెత్త తరలించే రిక్షాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో వార్డులకు వెళ్లి చెత్త సేకరించాల్సిన రిక్షాలు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. మండలంలోని పలు గ్రామాల్లో చెత్త తీసుకెళ్లే రిక్షాలు తుప్పు పట్టి మూలకు చేరాయి. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కనీసం గ్రామ పంచాయతీ చిన్న చిన్న అవసరాలకు కూడా వీటిని వినియోగించుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. ఎంతో అర్భాటంగా పంపిణీ చేసిన రిక్షాలు ఇలా నిరుపయోగంగా మారడం ప్రజాధనాన్ని దుర్వినియోగం పరిచయడమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిల వ్యవస్థలో ఉన్న రిక్షాలను తిరిగి వినియోగంలోకి తెచ్చి ప్రతి గ్రామపంచాయతీ పనులకు ఉపయోగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

గురువారం, 23.05.2024, హైదరాబాద్ | తెలుగు దిన పత్రిక | సంపుటి: 2, సంచిక: 222



## తీన్మార్ మల్లన్నను గెలిపించండి

- ఈ బైపోల్ ఎంతో ప్రతిష్ఠాత్మకం
- ఎమ్మెల్యేలు సీరియస్ గా తీసుకోవాలి
- ప్రతి పోలింగ్ బూత్‌లను సందర్శించాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికపై పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, మూడు జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్లమెంట్ ఇంఛార్జ్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇంఛార్జ్‌లు క్రియాశీలకంగా పని చేయాలని ఆదేశించారు. బుధవారం ఆయన తిరుమల నుంచి ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో జూమ్ మీటింగ్ లో పాల్గొని మాట్లాడారు. ఈనెల 27న పోలింగ్ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రతీ ఎమ్మెల్యే తమ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లను సందర్శించాలన్నారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి వారధిగా పని చేస్తారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆయన గెలుపు ఉపయోగపడుతుందన్నారు. ఇది తీన్మార్ మల్లన్న ఎన్నిక మాత్రమే కాదని.. కాంగ్రెస్ ఎన్నిక అని గుర్తించాలన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవం కోసం గర్జించిన తొలి గొంతుక



- తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యానికి స్ఫూర్తి
- నల్లగొండ పోరాటాలకు స్ఫూర్తి ప్రధాత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- తెలంగాణ రాష్ట్రం వచ్చాకే మంత్రి పదవి తీసుకుంటానని చెప్పిన ధీరుడు
- రక్తాన్ని చెమటగా మార్చి ప్రజా గొంతుకై రాజకీయాల్లోకి
- భుజాలు కాయలు కాసేలా మూడు రంగుల జెండా మోసిండు
- ముఖ్యమంత్రి స్థాయివ్యక్తి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- నల్గొండ నియోజకవర్గ చరిత్రలో హ్యాట్రిక్ విజయాల వీరుడు
- తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం
- 9 రోజులపాటు నిరాహార దీక్షతో అధిష్ఠానంలో కదలిక
- పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచిన విధేయుడు
- పదేళ్ల కాలం ప్రలోభాలకు లొంగని నేత
- నల్గొండ జిల్లా అంటే కోమటి రెడ్డి..అనేలా తనదైన ముద్ర
- కుమారుడి జ్ఞాపకాలతో అనేక సేవా కార్యక్రమాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఆత్మగౌరవం కోసం గర్జించిన తొలి గొంతుక, తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యానికి స్ఫూర్తి, నల్లగొండ పోరాటాలకు స్ఫూర్తి ప్రధాత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. కష్ట నష్టాల్లో పేదలకు సేవలందించిన పానగల్ బిడ్డ కోమటి రెడ్డి.. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన నాయకుడు. తెలంగాణ రాష్ట్రం వచ్చాకే మంత్రి పదవి తీసుకుంటానని చెప్పి నల్లగొండ పోరాట యోధుడు వెంకట్ రెడ్డి. కోమటిరెడ్డి బ్రదర్స్ దొరగారి దొడ్లో దొరకు సారాలో సోడాపోసి రాజకీయాలలోకి రాలేదు. రక్తాన్ని చెమటగా మార్చి.. భుజాలు కాయలు కాసేలా మూడు రంగుల జెండాను మోసి రాజకీయాల్లో పైకి వచ్చారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఎవరికైనా ముఖ్యమంత్రి పదవికి అర్హత ఉందంటే.. అది కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికే. ఇదే విషయాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్పష్టం చేశారు. అది ప్రజల్లో ఉండే ప్రజా నాయకుడి గొప్పతనం. ప్రజా గొంతుకైన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు.

### హ్యాట్రిక్ సాధించిన తొలి నేత

తెలంగాణ కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల్లో కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఒకరు. నల్గొండ జిల్లాకు చెందిన వెంకటరెడ్డి 1963 మే 23న జన్మించారు. 1999 నుంచి వరుసగా నాలుగుసార్లు ఆయన నల్గొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి చేతిలో వెంకటరెడ్డి ఓటమిపాలయ్యారు. నల్గొండ నియోజకవర్గ చరిత్రలో హ్యాట్రిక్ విజయాలు సాధించిన తొలి నేత ఈయనే. వైఎస్ రాజశేఖరెడ్డి హయాంలో తొలిసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ఐటీ శాఖ బాధ్యతలను పర్యవేక్షించారు. తర్వాత రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్లలోనూ మంత్రిగా పని చేశారు.

### 9 రోజులపాటు నిరాహార దీక్ష

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి 2011 అక్టోబర్లో శాసనసభ సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. కానీ స్పీకర్ రాజీనామాను ఆమోదించలేదు. మరుసటి నెలలో ఆయన 9 రోజులపాటు నల్గొండలో నిరాహార దీక్ష చేపట్టారు.

### కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్

కోమటిరెడ్డి వెంకటరెడ్డి కుమారుడు కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి 2011లో మెదక్ జిల్లా కొల్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన ఆ తరువాత తన కుమారుడి జ్ఞాపకార్థం కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి నల్గొండ పట్టణంలో రూ.3.5 కోట్లు ఖర్చు చేసి ప్రతీక్ స్మారక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బాలికల కోసం వృత్తి విద్యా నైపుణ్య కళాశాలను ఏర్పాటు చేసి, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను చేపట్టి ఫౌండేషన్ తరపున ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశాడు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా జాబ్ మేళాను నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నారు.

### ఎన్ఎస్‌యూఐ నుంచి రాజకీయ ప్రస్థానం

కోమటిరెడ్డి వెంకటరెడ్డి విద్యార్థిగా ఉన్నప్పుడే రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. 1986లో ఎన్ఎస్‌యూఐ జిల్లా ఇంఛార్జిగా పని చేశారు. వరుసగా నాలుగుసార్లు నల్గొండ ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన.. 2018 డిసెంబర్లో జరిగిన ఎన్నికల్లో ఓడారు. కానీ 2019లో భువనగిరి నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఓ దశలో ఆయన తెలంగాణ పీసీసీ చీఫ్ పదవిని ఆశించారు.

### ప్రలోభాలకు లొంగలేదు

పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచారు. అలా దాదాపు పదేళ్ల కాలం పాటు పార్టీ ప్రతిపక్షంలో ఉన్న కూడా ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదు. పార్టీపై ఆయనకు ఉన్న విధేయత, విశ్వసనీయత కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మరోసారి మంత్రి అయ్యారు. ఇంకా చెప్పాలంటే కాంగ్రెస్ కి నమ్మిన వ్యక్తి, కాంగ్రెస్ నే నమ్ముకున్న వ్యక్తి కోమటిరెడ్డి. నల్గొండ జిల్లా అంటే కోమటి రెడ్డి.. కోమటి రెడ్డి అంటే నల్గొండ జిల్లా అనే అంతలా జిల్లాపై తన ముద్ర వేశారు.

## ఆ మాట ఎన్నికల ముందు చెప్పాలి

- సన్న వడ్లకే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతారా?
- అలవి కాని హామీలిచ్చిన కాంగ్రెస్
- వందరోజుల్లో ఎక్కడ అమలు చేశారు?
- రాష్ట్రంలో విత్తనాలు, ఎరువుల కోసం క్యూ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రైతుభరోసా, రుణమాఫీ లాంటి హామీలను తుంగలో తొక్కి.. తాజాగా బోనస్‌పై మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్ - నల్లగొండ - ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ ప్రభుత్వం అలవిగానీ హామీలిచ్చి వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఐదు అమలు చేశానని చెబుతున్నాడు. ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిగా అమలు కాలేదు. ఫ్రీ బస్సులో ఆడోళ్లు కొట్టుకుంటున్నరు.. సీట్లు దొరకట్లేదని పురుషులు బాధపడుతున్నారు. ఫ్రీ బస్సు కూడా ఫెయిలైంది. ఇక క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తా అన్నాడు. నిన్న చావు కబురు చల్లగా చెప్పిండు. సన్న వడ్లకే మిగతా 2లో

## నా ప్రైవేటు ఫొటోలు లీక్ చేసేందుకు కుట్ర

- ఆప్ పార్టీ భారీ కుట్రకు తెరలేపుతోంది
- నకిలీ స్టింగ్ ఆపరేషన్లు చేయించాలని చూస్తున్నారు
- ఆప్ ఎంపీ స్వాతీ మాలీవాల్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**



ఆప్ ఎంపీ స్వాతీ మాలీవాల్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ప్రైవేటు ఫొటోలు లీక్ చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆమె నేరుగా ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ మీద ఆరోపణలు గుప్పించారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మిగతా 2లో

## కేంద్ర హోంశాఖ కార్యాలయానికి బాంబు బెదిరింపు

భద్రతా బలగాలు ముమ్మర తనిఖీలు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**



దేశ రాజధాని దిల్లీలోని కేంద్ర హోంశాఖ కార్యాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. నార్త్ బ్లాక్‌లోని కేంద్ర హోం మంత్రిత్వశాఖ కార్యాలయాన్ని పేల్చివేస్తామని దిల్లీ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బెదిరింపు ఈమెయిల్‌ను దుండగులు పంపించారు. మిగతా 2లో

## తరుగులేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి
- మాజీ మంత్రి హరీష్ రావు



వివరాలు 2లో

## పాక్ సానుభూతి పార్టీలతో భద్రం

- కాంగ్రెస్, సమాజ్ వాద్ పార్టీలు డేంజర్
- దేశ ప్రజలను భయపెట్టాలని చూస్తున్నాయి
- పాకిస్థాన్ పని అయిపోయింది..
- అయినా కాంగ్రెస్, ఎస్పీ తప్పుడు ప్రచారం
- ప్రధాని నరేంద్రమోడీ



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయంటూ దేశ ప్రజలను భయపెట్టేందుకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు పాక్‌కు సానుభూతిపరులు అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 2017లో యూపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి ప్రచారం చేసిన ఈ రెండు పార్టీలు (కాంగ్రెస్, ఎస్పీ) ఓటమి చవిచూశాయని.. ప్రస్తుతం మళ్లీ అవి కలిసి ప్రచారం చేయడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని ప్రధాని ఎద్దేవా చేశారు. "ఒకప్పుడు ఉగ్రవాదం పేరుతో మనల్ని బెదిరించినవారు ప్రస్తుతం ఆహార ధాన్యాల కోసం అల్లాడుతున్నారు. పాకిస్థాన్ పని అయిపోయింది. కానీ, ఆ దేశ సానుభూతిపరులైన ఎస్పీ, కాంగ్రెస్‌లు మాత్రం దేశాన్ని భయపెట్టే పనిలో బిజీగా ఉన్నాయి" అని మోదీ ఆరోపించారు.

### ఇది బలహీన ప్రభుత్వం కాదు.. మోదీ సర్కార్

'పాక్ వద్ద అణు బాంబులున్నాయని మనం భయపడాలని వారు అంటున్నారు. మిగతా 2లో

## పిన్నెల్లి అరెస్ట్?

- పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రచారం
- ధ్రువీకరించని పోలీసులు
- తెలంగాణ పోలీసులతో కలిసి.. ఏపీ పోలీసుల ముమ్మర తనిఖీలు





**విశాల భారతి,నేషనల్ బ్యూరో**

పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎంలను ధ్వంసం చేయడంతో పాటు నియోజకవర్గంలో హింసాత్మక ఘటనలు ఏర్పడేందుకు కారణమయ్యారని ఆయనపై ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఈవీఎం ధ్వంసం చేసిన తాలుకు సీసీటీవీ వీడియో ఇప్పుడు సంచలనంగా మారింది. దీంతో పిన్నెల్లిని తక్షణమే అరెస్టు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఫలితంగా ఏపీ పోలీసులు ఎమ్మెల్యే పిన్నెల్లిపై ఈనెల 20నే కేసు నమోదు చేశారు.

పిన్నెల్లి రామక్రిష్ణా రెడ్డి తెలంగాణలో ఉన్నారని తెలుసుకొని ఏపీ పోలీసులు ప్రత్యేక బృందాలుగా హైదరాబాద్‌కు వచ్చాయి. ఏపీ పోలీసులు, తెలంగాణ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి ఆయన కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా కంది దగ్గర పిన్నెల్లి కారును స్వాధీనం చేసుకున్నారు. ఆ కారులో ఉన్న పిన్నెల్లి కారు డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి దగ్గరే కారులో మొబైల్ వదిలేసి పిన్నెల్లి సోదరులు పారిపోయినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ గాలింపు చర్యల మిగతా 2లో

# ఉత్తమ్.. నా దగ్గర పూర్తి ఆధారాలున్నాయ్

## బహిరంగ చర్చకు సిద్ధమా?

- నేనొక్కడినే వస్తా.. మీరెందరైనా రండి
- మంత్రి, చౌహాన్ ఎవరికి వారు వసూల్ చేస్తున్నారు
- బీజేఎల్పీ నేత ఏలేటి సంచలన వ్యాఖ్యలు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ కలిసి చేసిన రూ.వెయ్యి కోట్ల స్కామ్ పై తన వద్ద పూర్తి ఆధారాలున్నాయని, ఈ విషయంపై మరోసారి మంత్రికి సవాల్ విసురుతున్నానని, స్కాంను పూర్తి ఆధారాలతో బయట పెడతానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై చేసిన ఆరోపణలకు తన వద్ద పూర్తి ఆధారాలున్నాయన్నారు. ఆయన దీనిపై స్పందించాక మళ్లీ మాట్లాడుతానన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఈ అంశంపై కౌంటర్ ఇచ్చే సీన్ లేదనుకుంటున్నట్లు చెప్పారు. ఈ అవినీతి ఆరోపణలపై ఉత్తమ్ తో బహిరంగ చర్చకు తాను సిద్ధమని, చర్చకు తాను ఒక్కడినే వస్తానని, వాళ్లు ఎంతమందయినా రావచ్చని సవాల్ విసిరారు. చర్చలో తాను సంధించే ప్రశ్నలకు ఉత్తమ్ సమాధానం ఇస్తే చాలని చెప్పారు. తాను వార్తల్లో నిలవాలనే మాట్లాడుతున్నానని మంత్రి అంటున్నారని ఏలేటి చురకలంటించారు. తాను గతంలో ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై మాట్లాడినప్పుడు ఉత్తమ్ ఎందుకు మాట్లాడలేదో సమాధానం చెప్పాలన్నారు. సివిల్ సప్లయ్ శాఖలో రూ.వెయ్యి కోట్ల అవినీతి జరిగిందన్నారు. ఇందులో మంత్రి ఉత్తమ్ లెక్క వేరని, చౌహాన్ లెక్క వేరని ఆయన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ నాయకులంతా తనకు సమానమేనని, తన ఆరోపణలపై ఉత్తమ్ స్పందించకపోతే అది అతని కర్మ అంటూ పేర్కొన్నారు. తనకు స్నేహితులుగా ఇంటికొస్తే దావత్ ఇస్తానని, కానీ రాజకీయంగా మాత్రం ఎదిరిస్తానని చెప్పుకొచ్చారు. తల్లి లాంటి బీజేపీని విమర్శిస్తే మాత్రం ఊరుకోబోనని వార్నింగ్ ఇచ్చారు. రిచెస్ట్ తెలంగాణను సర్వ నాశనం చేసింది కేసీఆర్ అని, కొడుకేమో హీరోయిన్ల వైపునకు, కూతురేమో లిక్కర్ వైపునకు వెళ్లారని ఆరోపణలు చేశారు. ప్రజలను డైవర్ట్ చేద్దామనుకున్నారని, కానీ కేసీఆరే.. డైవర్ట్ అయిపోయారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ లో లక్ష మెజారిటీతో గెలుస్తామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

# ఆ మాట ఎన్నికల ముందు చెప్పాలి


**మొదటిపేజీ తరువాయి**
బోనస్ ఇస్తడంట. అప్పుడేమో అన్ని వడ్లు. ఇప్పుడేమో కొన్ని వడ్లు అంటున్నారు. ఇదే మాట ఎలక్షన్లు ముందు చెప్పి ఉండాలి కదా..? 95 శాతం దొడ్డు బియ్యం పండిస్తున్నారు. సన్న వడ్లు పండించే 5 శాతం మందికి కూడా బోనస్ తీసుకోరు. ఎందుకంటే సన్న వడ్లకు ప్రయివేటు మార్కెట్ లో క్వింటాల్ కు రూ. 2,500 నుంచి రూ. 3 వేల వరకు ధర ఉంది. కాబట్టి గవర్నమెంట్ ఇచ్చే బోనస్ వైపు ఎవరూ చూడరు. మోసం చేయడమే కాంగ్రెస్ పని అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు అరచేతిలో వైకుంఠం చూపించారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ బాగుండే. ఇవాళ కరెంట్ కోతలు ఉన్నాయి. విత్తనాలు దొరకడం లేదు.. ఎరువులు లేవు. నాట్లు వేసేటప్పుడు పడాల్సిన రైతుబంధు ఓట్లు వేసేటప్పుడు పడుతున్నది. డిసెంబర్ లో పడాల్సిన రైతు బంధు మేలో పడుతుంది.. ఇది కాంగ్రెస్ తీసుకొచ్చిన మహా మార్పు అని కేటీఆర్ విమర్శించారు. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో ఐదు గంటల పాటు సాయంత్రం 4.30 నుంచి 9.30 దాకా కరెంట్ లేదు. ఐదు గంటలు కరెంట్ పోతే ఒక్క జనరేటర్ కూడా పని చేయలేదు. మరి నవజాత శిశువుల పరిస్థితి, ఐసీయూలో ఉన్న పేషెంట్ల పరిస్థితి ఏంటి..? ఇదేనా మార్పు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

# పాక్ సానుభూతి పార్టీలతో భద్రం

**మొదటిపేజీ తరువాయి**
ఈ 56 అంగుళాల ఛాతీ (మోదీని ఉద్దేశిస్తూ) గురించి వారికి తెలియదా? ఇది వారి బలహీన కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. బలమైన మోదీ సర్కార్. మనల్ని బెదిరించాలని ప్రయత్నించే వారిని భారత్ వదిలిపెట్టదు. వారి దేశంలోకి వెళ్లి మరీ వాళ్ల అంతు చూసింది'' ప్రధాని మోదీ పేర్కొన్నారు.
మరోవైపు.. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను గద్దె దించి అధికారం చేజిక్కించుకునేందుకు ఇండియా కూటమి తీవ్రంగా శ్రమిస్తోంది. మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ''అగ్నివీర్.. ఆర్మీ పథకం కాదు. ఇది మోదీ పథకం. దీని అవసరం భారత సైన్యానికి లేదు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని చెత్తబుట్టలో పడేస్తాం. దేశ సరిహద్దులకు మన యువత రక్షణ కల్పించగలదు. వారి నరనరాల్లో దేశభక్తి ప్రవహిస్తోంది. దేశ సైనికులను కూలీలుగా మార్చేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్నారు'' అని రాహుల్ వ్యాఖ్యానించారు

# అగ్నివీర్ పథకం రద్దు చేస్తాం

- మోడీకి పేదల ప్రయోజనాలు పట్టవు
- పెట్టుబడిదారుల రుణాలు మాఫీ చేసిన మోడీ
- అన్నదాతల రుణాలు ఎందుకు మాఫీ చేయరు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్నివీర్ పథకాన్ని పూర్తిగా రద్దు చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. హర్యానాలోని మహేంద్రగఢ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, భారతదేశ యువత సరిహద్దులను కాపాడుతున్నారు. వారి హృదయంలో దేశభక్తి ఉంది. కానీ ప్రధాని మోడీ అగ్నివీర్ పథకాన్ని ప్రవేశపెట్టి భారత జవాన్లను కార్మికుల్లాగా మార్చారు. ఆర్మీకి అగ్నివీర్ పథకం అవసరం లేదు. ఇది పీఎంఓ చేసిన పథకం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని పూర్తిగా చెత్తబుట్టలో పారవేస్తామని రాహుల్ తెలిపారు. మోడీ అమరవీరులు రెండు రకాలుగా ఉన్నారని చెప్పారు, ఒకరు సాధారణ జవాన్ లేదా అధికారి. వారి కుటుంబానికి పింఛను, ఇతర ప్రయోజనాలన్నీ అందుతాయి. మరొకరమే అగ్నివీర్ అని పేరు పెట్టబడిన పేద కుటుంబాలకు చెందిన యువకులు ... వారు అమరవీరులుగా పరిగణించబడరు, వారికి పింఛన్లు, ఇతర ప్రయోజనాలను అందవు, అందుకే ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లయితే ఈ పథకాన్ని తీసేస్తామని రాహుల్ అన్నారు. రైతుల రుణమాఫీ అంశంపై మాట్లాడిన ఆయన, దేశంలోని కొంతమంది పెట్టుబడిదారుల రూ. 16 లక్షల కోట్ల రుణాన్ని ప్రధాని మోడీ మాఫీ చేశారు. మరి రైతుల రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేస్తుందని ఆయన అన్నారు. వేల కిలోమీటర్ల మేర 'భారత్ జోడో యాత్ర' చేశాను, వెళ్ళిన ప్రతి చోట అక్కడ ప్రజలు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. మోడీ రైతుల సమస్యలు, ఉద్యోగాలు గురించి మాట్లాడరని రాహుల్ ప్రధానిపై విమర్శలు చేశారు.

# హామీలను తుంగలో తొక్కడమే ఇందిరమ్మ రాజ్యమా ?

- మేనిఫెస్టో అమలు మంత్రులకు క్లారిటీ లేదు
- బీఆర్ఎస్ సీనియర్ నేత రావుల శ్రీధర్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టో అభయహస్తం.. కానీ అది అక్కరకు రాని నేస్తం అయ్యిందని బీఆర్ఎస్ సీనియర్ నేత రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. మేనిఫెస్టో మాకు ఖురాన్, బైబిల్, భగవద్గీత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారని.. కానీ ప్రభుత్వ వ్యవహారశైలి అందుకు భిన్నంగా ఉందని విమర్శించారు. పవిత్ర గ్రంథాల పేర్లు తీసుకొని వాటిని అవమానించినట్లుగా ఉందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రావుల మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనపడట్లేదని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం అంటే హామీలను తుంగలో తొక్కడమా అని ప్రశ్నించారు.మేనిఫెస్టో అమలు విషయంలో మంత్రులకు క్లారిటీ లేదని.. సమన్వయం లేదని రావుల శ్రీధర్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ నిర్వహణలో కాంగ్రెస్ తడబడుతోందని ఆరోపించారు. రాజకీయం ఎక్కువ, పాలనపై దృష్టి తక్కువ పెడుతున్నారని అన్నారు. పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్నట్లుగా తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి తయారయ్యిందని అన్నారు. □కీలక అంశాలపై ముఖ్యమంత్రి, మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. వడ్ల బోనస్ అంశంపై మంత్రుల భిన్న ప్రకటనలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. రైతు భరోసా అమలు, కౌలు రైతులకు సాయం , వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12,000 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. 100 రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు నెరవేరుస్తామని చెప్పి.. రైతులను విత్తనాల కోసం లైన్లు కట్టే దుస్థితికి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయం విషయంలో.. రైతులకు సాయం చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్లానింగ్ లేదని రావుల విమర్శించారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారని రావుల ప్రశ్నించారు. ఫ్రీ స్కూటీలు వస్తాయని విద్యార్థినులు ఎదురు చూస్తున్నారని.. ఎప్పుడు ఇస్తారని అడిగారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ. 2500 ఏమయ్యాయని అడిగారు. వడ్డీ లేని పంట రుణాల పరిస్థితి ఏంటని నిలదీశారు. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ అన్నారని.. వాటి గురించి ఎక్కడ చర్చ కూడా లేదని అన్నారు.. 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఎక్కడ అని ప్రశ్నించారు. ఏ విషయంపై ప్రశ్నించినా విధి విధానాలు ఖరారు కాలేదంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా మేనిఫెస్టో అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానం, కాలపరిమితులను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

# పిన్నెల్లి అరెస్ట్?

**మొదటిపేజీ తరువాయి**
నేపథ్యంలో పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డిని పోలీసులు ఏ క్షణానైనా అరెస్టు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

### అన్ని ఎయిర్ పోర్టులకు అలర్ట్

ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ పిన్నెల్లి రామక్రిష్ణా రెడ్డిపై బుధవారం మధ్యాహ్నం (మే 22) ప్రెస్ మీట్ నిర్వహించారు. పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ లోనూ ఏపీ పోలీసులు వెతుకుతున్నారని.. అన్ని ఎయిర్ పోర్టులను కూడా అలర్ట్ చేసినట్లుగా ఆయన చెప్పారు. పోలింగ్ రోజు ఒక్క మాచర్లలోనే ఏడు ఘటనలు జరిగాయని చెప్పారు. ఘటనలన్నీ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించామని వివరించారు. పోలింగ్ రోజున ఏపీ వ్యాప్తంగా 9 చోట్ల ఈవీఎంలు ధ్వంసం అయ్యాయని చెప్పారు. ఎమ్మెల్యే పగలగొట్టిన ఈవీఎం లోని సమాచారం మొత్తం సేఫ్ గానే ఉందని చెప్పారు. ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంల ధ్వంసానికి సంబంధించి ప్రత్యేక దర్యాప్తు టీమ్ (సిట్)కు పోలీసులు అన్ని వివరాలను అందించారని చెప్పారు. 20వ తేదీన రెంటచింతల కోర్టులో పోలీసులు మెమో దాఖలు చేశారని.. అందులో 10 సెక్షన్ల కింద ఎమ్మెల్యేపై కేసులు పెట్టినట్లు తెలిపారు. ఆ కేసుల కింద ఆయనకు దాదాపు ఏడేళ్ల దాకా శిక్షలు పడే అవకాశం ఉందని వివరించారు. ఈసీ ఆదేశానుసారం నిన్నటి నుంచి ఎమ్మెల్యే పిన్నెల్లి అరెస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదని సీఈవో ముకేశ్ కుమార్ మీనా స్పష్టం చేశారు.

# కేంద్ర హోంశాఖ కార్యాలయానికి బాంబు బెదిరింపు

**మొదటిపేజీ తరువాయి**
సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన భద్రతా బలగాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి. సమీప ప్రాంతాల్లో భారీ స్థాయిలో పోలీసులను మోహరించారు. నార్త్ బ్లాక్ నుంచి ఉద్యోగులను బయటకు వెళ్లిపోవాల్సిందిగా భద్రతా బలగాలు సూచించాయి. వెంటనే హోం శాఖ కార్యాలయం పరిసర ప్రాంతాలను అదుపులోకి తీసుకున్నాయి. నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్, రాష్ట్రపతి భవన్ వైపు వెళ్లే మార్గాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయి. విజయ్ చౌక్, నార్త్ అవెన్యూ మార్గాల్లో అగ్నిమాపక యంత్రాలను ఢిల్లీ పోలీసులు సిద్ధం చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితోపాటు డాగ్ స్క్వాడ్, బాంబు నిర్వీర్య బృందాలు అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు ఎటువంటి అనుమానిత వస్తువులు గుర్తించలేదని తెలిపారు.

# నేడు ఎడ్‌సెట్

- 79 కేంద్రాల ఏర్పాటు
- రెండు సెషన్లలో నిర్వహణ
- ఏర్పాట్లు చేసిన అధికారులు

**విశాలభారతి,హైదరాబాద్:**
రాష్ట్రంలో రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే ఎడ్ సెట్ గురువారం జరగనుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎడ్ సెట్ ను రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్ ను నిర్వహించనున్నారు. ఎడ్ సెట్ కు మొత్తం 33,879 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం సెషన్ లో 16,929 మంది, రెండో సెషన్ లో 16,950 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 79 పరీక్ష కేంద్రాలు ఉండగా తెలంగాణలో 77 ఉన్నాయి. ఏపీలో విజయవాడ, కర్నూల్ లో రెండు కేంద్రాలను ఏర్పాటుచేశారు. విద్యార్థులు గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే మంచిదని అధికారులు సూచించారు.

# నా ప్రైవేటు ఫొటోలు లీక్ చేసేందుకు కుట్ర

**మొదటిపేజీ తరువాయి**
మాలీవాల్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ దాడికి పాల్పడిన ఘటన రాజకీయంగా దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆప్ నేతలు ప్రయత్నిస్తున్నారన్న స్వాతి తాజాగా మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. తన వ్యక్తిగత ఫొటోలు లీక్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని 'ఎక్స్' వేదికగా తెలిపారు. ''ఆప్ సీనియర్ నేత ఒకరు నిన్న నాకు కాల్ చేశారు. స్వాతిపై అభ్యంతరకర ఆరోపణలు చేయాలంటూ పార్టీలోని ప్రతి ఒక్కరిపై ఒత్తిడి పెరుగుతున్నట్లు చెప్పారు. నా వ్యక్తిగత ఫొటోలను లీక్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నట్లు సదరు నేత తెలిపారు. నాకు మద్దతుగా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తామని బెదిరిస్తున్నారట. నాకు వ్యతిరేకంగా మీడియా సమావేశాలు నిర్వహించేందుకు కొందరిని ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్‌లు చేసే బాధ్యతను ఇంకొందరికి అప్పగించారు. రిపోర్టర్లను కొట్టి నాపై నకిలీ స్టింగ్ ఆపరేషన్లు చేయించాలని చూస్తున్నారు'' అని స్వాతి ఆరోపించారు. ''నా గురించి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై కోపం లేదు. నిందితుడు చాలా శక్తిమంతమైన వ్యక్తి. పార్టీలో బడా నేతలు కూడా అతడికి భయపడతారు. అతడిని ఎదిరించి మాట్లాడే ధైర్యం ఎవరికీ లేదు. ఇవన్నీ నన్ను బాధించట్లేదు. కానీ, ఢిల్లీ మహిళా మంత్రి (ఆతిశీ) కూడా నవ్వుతూ నన్ను అవమానిస్తున్నారు. మీరు వేల మంది సైన్యాన్ని దించినా నేను ఒంటరిగా ఎదుర్కొంటా. ఎందుకంటే నిజం నావైపు ఉంది. నా ఆత్మగౌరవం కోసం ఈ పోరాటం మొదలుపెట్టా. న్యాయం జరిగే వరకు కొనసాగిస్తా. నేను ఒంటరి కావొచ్చు.. ప్రయత్నాన్ని మాత్రం వదిలిపెట్టను'' అని ఆమె రాసుకొచ్చారు. సీఎం కేజ్రీవాల్ నివాసంలోనే ఈ ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన బిభవ్‌ను ఢిల్లీ పోలీసులు నిన్న ముంబయి తీసుకెళ్లారు. అక్కడ అతడి ఐఫోన్ డేటాను రికవర్ చేసేందుకు నిపుణులు ప్రయత్నిస్తున్నారు. సీఎం నుంచి నివాసం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న నిందితుడు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, సీసీటీవీ రికార్డులను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు.

# హామీల అమలెక్కడ?

- రైతులకు కాంగ్రెస్ పంగనామం
- దొడ్డు వడ్లు కొనేందుకు ఇబ్బందేంటి?
- కేంద్రమే కొనుగోలు చేస్తుంది కదా..
- వర్షాలు పడుతున్నా కొనుగోళ్ల చేయరా?
- ధాన్యం మొలకలు వస్తున్నా పట్టదా?
- బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి సర్కార్ విఫలమయ్యిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. దేవుళ్లపై ఒట్ల పేరుతో ప్రజలకు కాంగ్రెస్ పంగనామం పెట్టిందని విమర్శించారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఏమైందని ప్రశ్నించారు. వరి పంటకు బోనస్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని అన్నారు. డిసెంబర్ 9వ తేదీనే రుణమాఫీ చేస్తానని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడేమో ఆగస్టు 15లోగా చేస్తామని అంటున్నారని సీరియస్ అయ్యారు. రాష్ట్రంలో 80 శాతం దొడ్డు వడ్లనే పండిస్తారని.. చాలా తక్కువ మంది మాత్రమే సన్న వడ్లు పండిస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. దొడ్డు వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్దంగా ఉందని క్లారిటీ ఇచ్చారు. దొడ్డు వడ్లను కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. వర్షాలకు ధాన్యం తడిచి మొలకెత్తుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి వారాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న 75వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. ఇలాగే కొనసాగితే మొత్తం ధాన్యం కొనేందుకు రెండు నెలల సమయం పడుతుందని మండిపడ్డారు. వర్షాలు పడి ధాన్యం మొలకలు వస్తుంటే.. బాధ్యులు ఎవరని ప్రశ్నించారు

# తరుగులేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తుఫాన్ ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం రోజుల తరబడి వడ్లు కొనకపోవడం వల్ల వడ్లు తడిచే అవకాశం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు.ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కల్లాల్లో పడిగాపులు కాచే పరిస్థితి ఏర్పడింది. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందన్నారు. చిన్నకోడూరు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారని చెప్పారు. ధాన్యం ఒకటికి రెండుసార్లు తడిసి మొలకెత్తింది. ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకెత్తిందని కొనడం లేదని పేర్కొన్నరు. ఒక వేళ కొన్నా తరుగు తీసేయడం వల్ల సంచికి మూడు కిలోలు కోతపెట్టే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.

### సన్నాల పేరుతో మోసం..

తరుగు లేకుండా వెంటనే వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. చిన్నకోడూరు రైతులతో మాట్లాడినప్పుడు ఇంటి అవసరాలకు మాత్రమే సన్న వడ్లు పండిస్తామని, మిగతా వడ్లన్నీ దొడ్డువడ్లేనని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్నవడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగయింది. 3 లక్షల 29 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం వేశారు. రూపాయికి 95 శాతం దొడ్డువడ్లు పండించే వాళ్లకు బోనస్ ఎగ్గొట్టి , కేవలం ఐదు శాతం సన్నబడ్లు పండించే వాళ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తానాల కోసం రైతుల పాస్ పుస్తకాలు లైన్లో పెట్టి వేచి చూసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రులు కల్లాల్లో తిరిగేవాళ్లు. ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని డిమాండ్ చేశారు.

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily





# ఇష్టం వచ్చినట్లు కరెంటు కోతలు

- **రోజుకు రెండు నుంచి మూడుసార్లు కరెంటు కట్**
- **పట్టించుకోని సిబ్బంది**

**ఆర్మూర్, విశాల భారతి**ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం బాద్గుణ సబ్ స్టేషన్ పరిధిలో ఉమ్మేడ, మాయాపూర్, బాద్గుణ గ్రామాలలో.. ప్రతి రోజు ఏదో ఒక సాకుతోని కరెంటును తీసివేయడం జరుగుతుంది. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా సిబ్బంది పనిచేస్తున్నట్లు ఆ నోట ఈ నోట వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వేసవి కాలంలో ఇదే విధంగా ఉంటుంది అని సమాధానం చెబుతున్నారు. గ్రామస్తులు బి ఆర్ ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పరిపాలించినప్పుడు లేని ఇబ్బంది ఇప్పుడు ఎందుకు అవుతుందని ప్రశ్నించుకుంటున్నారు. రాత్రి వేళలో కొన్ని అసాంఘిక కార్యక్రమాలకు కూడా కరెంటు తీసివేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అయితే ఏడి అశోక్వ ర్షాకాలం సీజన్ ప్రారంభం అవడంతో ఈదురు గాలులు వలన అక్కడక్కడ సమస్యలు ఎదురవుతున్నాయి అన్నారు. కరెంటును నిరంతరం ఇవ్వడానికి మా సిబ్బంది పనిచేస్తుందని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా పనిచేయడం లేదు అని అన్నారు.

# 13 మంది ఓపిఓలు సస్పెండ్

- **జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు**

**సూర్యాపేట, విశాలభారతి:** ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణ తరగతులకు రాని 13 మంది ఓపిఓలను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలపై ఓపిఓలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు నిర్లక్ష్యంగా వ్యవహరించి రాని 13 మంది ఓపిఓలను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా సంబంధిత శాఖలకు చెందిన జిల్లా అధికారులు వివరణ సమర్పించవలసిందిగా కలెక్టర్ ఆదేశించారు.శిక్షణ తరగతులు హాజరుకాని 13 మంది ఓపిఓలను ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.






# వాటర్ ఫిల్టర్ వితరణ

**భద్రాచలం,విశాలభారతి:** స్థానిక భద్రాచలం కహల్ స్వచ్ఛంద సేవ సంస్థకి ఉపాధ్యాయులు జివి వారి తల్లి తండ్రుల జ్ఞాపకార్థం కహల్ సొసైటీ వారికీ ఎండాకాలం చల్లని నీరు అందించటం కోసం వాటర్ ఫిల్టర్ వితరణ చేస్తున్నామని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులతో వాటర్ ఫిల్టర్ బహుకరించడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కమిటీ సభ్యులు గ్రామస్తులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు జివి, వాటార్ ఫిల్టర్ అందజేసి మానవత్వాన్ని తెలిపారని అలాగే గడిసిన 5 సంవత్సరాల నుండి కూడా సంస్థ కు వారుచేసిన అనేక సేవలను కొనియాడారు. కహల్ సంస్థ యాజమాన్యం పి వేణు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో శివ, జాన్సన్, వెంకటనర్సమ్మ, కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్న గెలిపించండి

- **ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**తొర్రూరు, విశాలభారతి:** ప్రజల గొంతుకై అధికార పక్షాల విధానాలను ఎండిగడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల్ని చైతన్యపరిచే తీన్మార్ మల్లన్న కి ఓటు వేసి గెలిపించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మార్నింగ్ వాకింగ్ లో పట్టభద్రులను అభ్యర్థించారు. తీన్మార్ మల్లన్న కొన్ని సంవత్సరాల నుండి ప్రజా సమస్యలపై గత ప్రభుత్వాన్ని ఎండగడుతూ ప్రజలకి చాలా చేరువాయి ప్రభుత్వ లోపాలను ఎత్తిపోడుతూ నిరుద్యోగులకు బాసడగా నిలుస్తూ అణగారిన పేద విద్యార్థులకు తన వంతు సహాయాన్ని సహకారాలు అందిస్తూ మంచి పేరు సాధించారు. ఇలాంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీ తరపున వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో నిలబడడం అభినందనీయం ఇలాంటి వ్యక్తిని చట్టసభలలో ఎన్నుకొని నిరుద్యోగులకు మరియు పేద వర్గాలకు అన్ని రకాల సమస్యల మీద పోరాడే వ్యక్తిని ఎన్నుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోరూర్ మున్సిపాలిటీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, తొర్రూరు పట్టణ యూత్ అధ్యక్షుడు మహేష్ యాదవ్ మహబూబాబాద్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, కౌన్సిలర్ భూసాని రాము, పెదగాని సోమన్న, చాపల బాపురెడ్డి, భాస్కర్ రెడ్డి, రోహిన్, భీష్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలను ధరిచేరనీయకండి

- **డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బనగిరి చైతన్య రెడ్డి**
- **బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ కు డీవైఎఫ్ఐ వినతిపత్రం.**



**కూకట్ పల్లి విశాలభారతి:**కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీ, బస్తీలో యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, మత్తు పదార్థాలను అరికట్టేందుకు బుధవారం డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బనగిరి చైతన్య రెడ్డి బాలానగర్ సీఐ నవీన్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో, బస్తీలలో నిర్మానుష్య ప్రదేశాలను ఎంచుకుని కొందరు యువకులు మత్తు పదార్థాలను సేవిస్తూ స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. అట్టి వారిపై చర్యలు తీసుకొవాలని, గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో యువత, తల్లిదండ్రులతో కలిసి మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా పోలీసులు సైతం భాగస్వామ్యం కావాలని, యువతకు తమ వంతు అవగాహన కల్పించి మాదకద్రవ్యాల నిర్మూలకు కృషి చేయాలని, ముఖ్యంగా నిర్మానుషమైన ప్రదేశాలలో ముఖ్యంగా రాత్రి వేళలో గస్తీ నిర్వహించాలని సీఐ నవీన్ కుమార్ కు వినతి పత్రం ద్వారా కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకునేందుకు పెట్రోలింగ్ పెంచుతామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతి భద్రతకు సహకరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గుట్టమీద కార్తిక్, డీవైఎఫ్ఐ నాయకులు నగేష్ సతీష్ కుమార్, ఎస్. మల్లేష్, శ్రీను, రాజు, అభి, అరుణ్, అనిల్, మాజీ డీవైఎఫ్ఐ నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం రామాలయంలో జూన్ 1 హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేనందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఇఓ రమాదేవి సిబ్బందిని ఆదేశించారు. ఆరోజు ఉదయం అంజన్నకు అభిషేకం, తమలపాకుల పూజ చేస్తారు. రాత్రికి రాముల వారితో కలిసి ఆంజనేయుడికి తిరువీధి సేవ ఉంటుందని పేర్కొన్నారు.




# సఖి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా మహిళా శిశు శాఖ అధికారి

**వనపర్తి విశాల భారతి:**జిల్లా కేంద్రం లోని సఖి కేంద్రాన్ని బుధవారం జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిణి లక్ష్మి భాయి సందర్శించారు. ఈ సందర్భంగా ఆ కేంద్రంలోని వివిధ దస్త్రాలను ఆమె పరిశీలించారు. సఖి కేంద్రానికి వచ్చే కొందరు బాధితులతో ఆమె మాట్లాడి వారికి అందుతున్న వసతులు సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సిడిపిఓ లక్ష్మమ్మ, వనపర్తి మెడికల్ ఆఫీసర్ వైష్ణవి, ఐసిడిఎస్ పర్యవేక్షణాధికారిణి జ్యోతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, డిడబ్ల్యుఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర చారీ, సఖి కేంద్రం ఇంప్లీమెంటింగ్ ఏజెన్సీ, ఆర్డీఎస్ సంస్థ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, సఖి సంస్థ కార్య నిర్వాహకురాలు M.కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాకేశ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

**దేవరుప్పుల, విశాలభారతి:** మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ అధ్యక్షతన రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు పల్లా సుందర్ రాంరెడ్డి పాల్గొని ఉమ్మడి వరంగల్,ఖమ్మం,నల్గొండ నియోజకవర్గ పట్టభద్రుల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా 23052024 గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తొర్రూర్ మున్సిపాలిటీ కేంద్రంలో PSR స్కూల్ ఆవరణలో పట్టభద్రుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేయబడునని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిలుగా పాల్గొనున్న రాష్ట్ర మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు,మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి,RS ప్రవీణ్ కుమార్,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలు పాల్గొనున్నారని,కావున ఈ సమావేశంలో దేవరుప్పుల మండలం నుండి పట్టభద్రులు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# నివాళులర్పించిన నల్ల శ్రీరాములు

**దేవరుప్పుల, విశాలభారతి:** కామారెడ్డి గూడెం గ్రామానికి చెందిన కారుపోతుల యాదమ్మ (60) హైద్రాబాద్ లో మరణించగా వారి స్వగ్రామానికి వారి దేహాన్ని తీసుకురాగా వారి ఇంటికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి వెంట మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసారపు ధర్మారెడ్డి,ఓడపెల్లి కొమురయ్య,ఓడపెల్లి రవీందర్, బోనగిరి యాకస్వామి, పులిగిల్ల వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు ఓడపల్లి పుల్లయ్య, పులిపంపుల భాస్కర్, దుద్దుల పరశురాములు, రెడ్డి రాజుల రమేష్, ఓడపెల్లి పూర్ణ, యాకన్న, వెంకన్న, అశోక్, సాత్విక్, తదిరులున్నారు.



# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- **కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో శాసన మండలి గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికలు 2024 నేపథ్యంలో పివో , ఎపివోల బాధ్యతలు కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్ అన్నారు. బుధవారం గ్రాడ్యుయేట్ శాసన మండలి 2024 ఉప ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పివో , ఎపివో లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు అదనపు కలెక్టర్ సి హెచ్ ప్రియాంకతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రాడ్యుయేట్ శాసన మండలి ఉప ఎన్నికలు తేది 2752024 నాడు ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 4: 00 గంటల వరకు జరుగుతాయని జిల్లాలో 51,497 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని అలాగే పోలింగ్ కొరకు రిజర్వ్ తో కలిపి 85 మంది పివోలు,85 ఎపివోలు,170 మంది ఒపీవో లుగా సిబ్బందిని నియమించమని అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా జరుగుతాయని ఈ ఎన్నికలో 52 మంది పోటీ చేస్తున్నందున జంబో బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు చేశామని, బ్యాలెట్ పేపర్ కూడా పెద్దగా ఉన్నందున ఓటు వేసిన తర్వాత జాగ్రత్తగా మడిచి బ్యాలెట్ బాక్స్ లో వేయాలని, అన్ని కేంద్రాలలో ముందుగానే మౌలిక వసతులు, త్రాగునీరు, ఎలక్ట్రిసిటి ఏర్పాటు చేయాలని , పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారి, సిబ్బంది విధులు పూరించవలసిన పత్రాలపై అవగాహన కల్పించుట, పోలింగ్ కేంద్రాలలో ముఖ్యులు సందర్శించినప్పుడు పి.ఓ డైరీ లో తప్పక రాయాలని సూచించారు. సమావేశంలోఎంసీసీ నోడల్ ఆదికారి డి ఎఫ్ వో సతీష్ కుమార్, మాన్పవర్ మేనేజ్మెంట్ నోడల్ఆదికారి జడ్పీ సీఈఓ అప్పారావు, రిపోర్టింగ్ నోడల్ఆదికారి డి ఆర్ డివో మధు సూధనరాజ్ ,జిల్లా రవాణా అధికారి సురేష్ ,జిల్లా అబ్కారి శాఖ అధికారి లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# సమ్మెకు సిద్ధమైన మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు

- **మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల రోజు దర్శనం చెల్లించాలి**
- **సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్**

**మణుగూరు, విశాలభారతి:** మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ రథం గుట్ట దగ్గర పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉండడంతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు లేక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని పెండింగ్లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ గత పది సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని వారికి సకాలంలో వేతనాలు లేక వారి కుటుంబాలు రోడ్డున పడుకున్నాయని అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన మండిపడ్డారు. వేతనాలు సకాలంలో ఇవ్వకపోతే సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా ఆపేస్తూ సమ్మె నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో కార్మికులందరినీ ఐక్యత పరిచి ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాయం నాగరాజు, సతీష్, ప్రభాకర్, విష్ణు, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# జడ్పీటీసీగా దేశిరెడ్డి జ్యోతి స్టాలిన్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**కోదాడ, విశాలభారతి:** 2019లో జరిగిన జడ్పిటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ గెలుపు చల్లదంటూ హైకోర్టు విచారణ జరిపి తీర్పు ఇచ్చినది. దేశిరెడ్డి జ్యోతి స్టాలిన్ రెడ్డి మునగాల జడ్పిటిసిగా సూర్యాపేట జిల్లా పరిషత్ కార్యాలయం నందు ప్రమాణ స్వీకారం చేసినారు. జడ్పిటిసి గా దేశి రెడ్డి జ్యోతిస్టాలిన్ రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి మాట్లాడుతూ 2019లో జరిగిన జడ్పిటిసి ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ తప్పుడు పత్రాలను సమర్పించి తప్పుడు పద్ధతుల్లో గెలిచారని వీరి గెలుపు చెల్లదంటూ దేశీ రెడ్డి జ్యోతి స్టాలిన్ రెడ్డి హుజూర్నగర్ కోర్టును 2019లో ఆశ్రయించగా 2024 ఫిబ్రవరిలో 05న టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ గెలుపు చేలదంటూ తీర్పు ఇచ్చారని తెలిపారు. దేశిరెడ్డి జ్యోతి స్టాలిన్ రెడ్డికి జడ్పిటిసిగా తీర్పును ఇచ్చినారని అన్నారు. మరల నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టులో విచారణ జరిపి జ్యోతి స్టాలిన్ రెడ్డికి మునగాల జడ్పీటీసీగా తీర్పు వచ్చిందని ఈ తీర్పు సిపిఎం పార్టీ విజయంగా భావిస్తున్నాం అని అన్నారు. మునగాల పరగణ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి నేటి వరకు అనేకమంది ఎర్రజెండా నాయకత్వాన పేద ప్రజల పక్షాన నికరంగా నీతిగా నిజాయితీగా నిలబడి తమ ప్రాణాలర్పించారని వారికి ఈ విజయాన్ని అంకితం చేస్తూ రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బుర్రి శ్రీరాములు, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి, దేశి రెడ్డి స్టాలిన్ రెడ్డి, నారాయణగూడ సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, సురేష్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆడవాళ్ల మంచి ఆరోగ్యానికి ఇవి చాలా అవసరం

**రోజువారీ డైట్‌లో ఇవి తప్పకుండా ఉండాలి ▪ మహిళలకు అవసరమైన ఎనర్జీ అందుతుంది**

**విశాలభారతి ప్రత్యేకం:**

మహిళల ఆరోగ్య కోసం అన్ని రకాల పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా మహిళలు పౌష్టికాహారంపై దృష్టి సారించాలి. విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు, ఫైబర్, ఇతర న్యూట్రియెంట్స్ ఉండే ఆహారాలు తినాలి. అయితే కొన్ని నట్స్‌లో అన్ని రకాల పోషకాలు ఉంటాయి. వీటిని రోజూ తింటే, మహిళలకు అవసరమైన ఎనర్జీ అందుతుంది. రోజువారీ డైట్‌లో 5 రకాల నట్స్ చేర్చుకుంటే చాలా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండవచ్చు.



### వాల్‌నట్స్

శరీరంలో రక్త కణాలు కీలక పాత్ర పోషిస్తాయి. అలాంటి రక్త కణాలు ఆరోగ్యంగా ఉండటానికి వాల్‌నట్స్ సాయం చేస్తాయని హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. వాల్‌నట్స్‌లో లినోలీక్, ఆల్ఫాలినోలెనిక్ యాసిడ్స్ ఉంటాయి. ఇవి రక్తంలోని లిపిడ్ స్థాయులపై సానుకూల ప్రభావం చూపిస్తాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలతో ఇవి శరీర కణాల్లో వాపును తగ్గించి అనారోగ్యాల రిస్క్ తగ్గిస్తాయి.

### బాదం

శరీరంలో కొలెస్ట్రాల్, బ్లడ్ ప్రెషర్ తగ్గించే సమ్మేళనాలు బాదంలో ఉంటాయి. ఇవి రక్తంలోని షుగర్ లెవెల్స్ కూడా కంట్రోల్ చేస్తాయి. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ప్రొటీన్, ఐరన్, ఫైబర్, విటమిన్ E పుష్కలంగా ఉంటాయి. దీంతో డైట్‌లో బాదం పప్పులను చేర్చుకుంటే, మంచి ఎనర్జీ అందుతుంది.

### జీడిపప్పు

జీడిపప్పులో ఫైబర్, ప్లాంట్ ప్రొటీన్ పుష్కలంగా ఉంటాయి. గుండెకు మేలు చేసే కొవ్వులకు ఇది నిలయం. జీడిపప్పులో ఉండే కాపర్, మాంగనీస్, మెగ్నీషియం వంటి మినరల్స్, మహిళలకు ఎనర్జీ అందిస్తాయి, ఎముకలను బలంగా మారుస్తాయి. రోజూ ఈ నట్స్ తింటే రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుంది, గుండె ఆరోగ్యం బలోపేతం అవుతుంది. అలసట రాదు.

### ఎండు ద్రాక్ష

ఎండు ద్రాక్ష ఇమ్యూనిటీ బూస్టర్స్. వీటిలో ఉండే విటమిన్ బి, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మహిళల్లో సాధారణంగా కనిపించే ఐరన్ లోపానికి కూడా ఇవి చెక్ పెడతాయి. బ్లాక్ రైసిన్స్‌లో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. దీంతో ఐరన్ లోపం బాధితులు సప్లిమెంట్స్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. వీటిలో ఉండే పొటాషియం, ఎముకల పటుత్వాన్ని పెంచుతుంది, బోన్ ఫ్రాక్చర్స్‌కి దారితీసే ఆస్టియోపోరోసిస్ రిస్క్‌ను తగ్గిస్తుంది.

### పిస్తా పప్పులు

పిస్తాపప్పులో ఫైబర్, మినరల్స్, అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి శరీరంలోని కొలెస్ట్రాల్‌ను కంట్రోల్ చేస్తూ మొత్తం శ్రేయస్సును మెరుగుపరుస్తాయి. పిస్తా పప్పులు రోజూ తింటే రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇందులోని ప్రోటీన్, ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. ఫలితంగా వేరే ఆహారాలు ఎక్కువగా తినాలనే కోరిక తగ్గుతుంది. శరీరంలో ఎక్కువ క్యాలరీలు చేరవు కాబట్టి బరువు కంట్రోల్‌లో ఉంటుంది.

# ఏఐలో మనుషుల తరహా లక్షణాలు మంచిది కాదు

**▪ మనుషులకు మాత్రమే 'ఇంటెలిజెన్స్' ఉంటుంది**

**▪ మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అసంతృప్తి**



**విశాలభారతి జాతీయం:**

ఏఐను మనుషుల్లా భావించడం ఆపాలని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఐలో మనుషుల తరహా లక్షణాలను తీసుకురావాలనే ఆలోచన సరికాదని తాను భావిస్తున్నట్లు నాదెళ్ల వెల్లడించారు. అలాగే ఏఐని ఒక సాధనంగా మాత్రమే ట్రీట్ చేయాలని మనుషులకు ఉపయోగించినట్లుగా నామవాచకాలు, సర్వనామాలు వాడడంపై కూడా ఆయన భిన్నంగా స్పందించారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే పదజాలంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని 'డిఫరెంట్ ఇంటెలిజెన్స్'గా వ్యవహరించి ఉండాల్సిందని సూచించారు. మనుషులకు మాత్రమే 'ఇంటెలిజెన్స్' ఉంటుందని.. ప్రత్యేకంగా దాన్ని ఆర్టిఫిషియల్‌గా పొందాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఏఐతో పూర్తిగా వాణిజ్యపరమైన సంబంధమే ఉండాలని నాదెళ్ల సూచించారు. అవసరమైనప్పుడు సేవలందించే సాధనంగా మాత్రమే ఉపయోగించుకోవాలని తెలిపారు. మనుషుల మధ్య బంధాన్ని రీప్లేస్ చేసేలా అది ఉండకూడదన్నారు.









# చోరీకి గురైన సామాగ్రి రికవరీ చేయాలి

■ **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధి కారిణి కి వినతి పత్రం అందజేత**

**మణుగూరు, విశాలభారతి:** ప్రభుత్వ 100 పడకల హాస్పిటల్ లో చోరీకి గురైన సామాగ్రి రికవరీ చేయాలనీ, కాంటాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనీ కోరుతూ ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ఆసుపత్రి సందర్శనకు వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారిణి జేవిఎల్ శిరీష కి బుధవారం నాడు ఐఎఫ్టియు జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు నాయకత్వంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో దాతలు ఇచ్చిన సామాగ్రితో పాటు కొంత హాస్పిటల్ సామాగ్రి కూడా చోరీకి గురైనట్లుగా వార్తలు వస్తున్నాయనీ దీనిపై సమగ్ర విచారణ జరిపించి సామాగ్రిని రికవరీ చేయాలనీ దాతలకు నమ్మకం కలిగించాలనీ దోషులు ఎంతటి వారైనా ఎవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న కాంటాక్ట్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించే విధంగా మరియు ప్రస్తుతం హాస్పిటల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ జమ వివరాలతో కూడిన పాస్ బుక్ లు అందజేయాలి భీమ పథకాలు వర్తింపచేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీ యు జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ప్రగతిశీల మహిళా సంఘం మణుగూరు డివిజన్ కార్యదర్శి రాపర్తి లక్ష్మి, ఉప్పల శివరామకృష్ణ, పెనుగొండ నాగార్జున పి వై ఎల్ నాయకులు సాధన పల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



# సమ్మర్ బైబిల్ క్యాంపు నిర్వహణ

**పాలకీడు, విశాలభారతి:** నేరేడుచర్ల మండల కేంద్రంలోని పత్తేపురం గ్రామంలో గేత్సమనే ప్రార్ధన మందిరంలో చిన్న పిల్లల కోసం సమ్మర్ క్యాంపు ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ క్యాంపులో సీబీసీ, చిల్డ్రన్స్ బైబిల్ క్లబ్ గురించి పిల్లలకు చెప్పారు. ఇట్టి క్యాంపు దైవ సేవకులు పాస్టర్ అబ్రహం, సమాధానం, మరియు చిల్డ్రన్ మిషనరీ పాస్టర్ కట్టా అనిల్, శైలజ వారి ఆధ్వర్యంలో పిల్లలకు క్లాసులు చెప్పరు.ఇంకా కట్టా అనిల్ మాట్లాడుతూ ఇందులో పిల్లలు దేవుని గురించి తెలుసుకోడం, అలాగే మనం పెద్దలతో, పిల్లలతో, తోటివారితో ఎలా నడుచు కోవాలో, తల్లిదండ్రులను గౌరవించడం గురించి చెప్పడం జరిగింది. ఇట్టి బైబిల్ క్యాంపులో ఇంకా పిల్లలు అందరు కలిసి ఆటలు, పాటలు, మ్యాజిక్ షో, పేప్పేట్ షో, వివిధ కార్యక్రమాల ద్వారా పిల్లలు చాలా గొప్ప విషయాలు నేర్చుకోవడం జరిగింది. కార్యక్రమానికి పత్తేపురం గ్రామ సమీపంలోని పత్తేపురం, మేడారం, వైకుంఠపురం గ్రామాల పిల్లలు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# ఉద్యమ నేత పర్సా సత్యనారాయణకు జోహార్లు

■ **సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు**

**సూర్యాపేట, విశాలభారతి:** స్వతంత్ర సమర యోధుడు, సాయుధ రైతాంగ పోరాట యోధుడు పర్సా సత్యనారాయణ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సూర్యాపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయం లో కార్మిక ఉద్యమ నేత పర్సా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వతంత్ర పోరాటం తో పాటు తెలంగాణ సాయుధ పోరాట కాలం వరకు ప్రత్యక్షంగా పాల్గొని అనేక నిర్బంధాలు ఎదురుకున్న ధైర్య శీలి పర్సా అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం వదులుకొని కార్మికులను ఐక్యం చేసీ ఉద్యమాలు నిర్మించి హక్కులు సాధించిన కార్మిక నాయకుడు పర్సా అని తెలిపారు. కార్మిక యునియన్ లు నిర్మించి కార్మికులను ఐక్యం చేసీ రాజకీయా శిక్షణలు ఇప్పించి నాయకులుగా తీర్చి దిద్దిన నాయకుడనీ కొని యడారు. కులాంతర మతాంతర వివాహాలు ప్రోత్సహించి స్వయంగా ఇరువైపులా తానే ఒప్పించి పెళ్లిలు చేసి వారికి ఉపాధి చూపించే వారని గుర్తు చేశారు. సంగిటిత, అసంఘటిత కార్మికులను ఐక్యం చేసే పోరాటాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. నేడు కేంద్రము లోనీ బిజేపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడు లను వెనుకకు తీసుకునే వరకు కార్మిక వర్గం గట్టిగా పోరాడాలని నెమ్మాది కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు, సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు ఎం. శేఖర్,ప్రజా సంఘాల నాయకులు జే. నర్సింహా రావు, చిన్నపంగి నర్సయ్య, వీరబోయిన రవి యాదగగిరి తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

■ **ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్ రెడ్డి**

**పినపాక, విశాలభారతి:** గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పినపాక మండలంలోని వివిధ గ్రామపంచాయతీలను సందర్శించి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామపంచాయతీలలో 2 నుండి 5 నెలల వరకు జీతాలు పెండింగ్ ఉన్నాయని దీనివలన ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆయనకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చెత్తా,చెదారం మధ్య దుర్గంధ వాసనల మధ్య తమ ఆరోగ్యాలను, ప్రాణాలను పణంగా పెట్టి చాలీ,చాలని వేతనాలతో పనిచేస్తూ, పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ఆరోగ్యాలను, ప్రాణాలను కాపాడుతున్నప్పటికీ గ్రామపంచాయతీ కార్మికుల పట్ల సంబంధిత అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అసలే చాలీ,చాలని వేతనాలతో పని చేస్తున్న వారికి నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి జీతాలు మొత్తం చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే ఉత్తమ్‌పై ఆరోపణలు

■ **మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి**

**కోదాడ, విశాలభారతి:** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పై బిజెపి ఎమ్మెల్యే, శాసనసభ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు కోదాడ కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు మాట్లాడారు. నిస్వార్ధంగా నీతి, నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి పై రాజకీయ లబ్ధి కోసం బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారన్నారు. సైన్యంలో సైనికుడిగా పనిచేసి ప్రజాసేవ కోసం రాజకీయాలకు వచ్చి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, రెండుసార్లు మంత్రిగా నిస్వార్ధంగా పనిచేస్తూ మచ్చలేని నాయకుడిగా ఉత్తమ్ కు పేరు ఉందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని ధ్వజం ఎత్తారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో నిందలు వేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు రెండు ఒకే తాను ముక్కలు అని విమర్శించారు. నిరాధారమైన ఆరోపణలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్రమైన పరిణామాలను ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ డిసిసిబి అధ్యక్షులు ముత్తవరపు పాండురంగా రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్ గంధం యాదగిరి, శివయ్య, ధావల్ తదితరులు పాల్గొన్నారు.





# చిన్నారి ప్రాణాలను మింగేసిన కారు

**మణుగూరు, విశాలభారతి:** జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అప్పటి వరకు కళ్ళ ముందుకు ఆడుకుంటూ కనిపించిన చిన్నారి అనంతలోకాలకు వెళ్ళింది. కారు డోర్ లాక్ కావడంతో ఉపిరాడక తుదిశ్వాస విడిచింది. మణుగూరు మండలం సాంబాయిగూడెంలో ఈ విషాదం వెలుగు చూసింది. ఆడుకుంటూ వెళ్లి కారెక్కిన మూడేళ్ల చిన్నారి, కార్ డోర్స్ లాక్ అవడంతో మృతి చెందింది. కల్నిష అనే మూడేళ్ల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు నిలిపి ఉంచిన కారులోకి ఎక్కింది. ఈ క్రమంలోనే డోర్స్ లాక్ అవడంతో చిన్నారి కారులోనే చిక్కుకుపోయింది. ఇంటి పక్కన ఆడుకుంటుందేమో అనుకున్న తల్లిదండ్రులు చిన్నారి ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో కంగారుపడ్డారు. చుట్టూ పక్కల ప్రాంతాల్లో తల్లిదండ్రులు వెతికారు. అయితే ఫలితం లేకపోయింది. చివరికి ఇంటి ముందు నిలిపి ఉంచిన కారులో కనిపించింది కల్నిషా. వెంటనే కారు డోర్స్ ఓపెన్ చేసి చూడగా అప్పటికే తుదిశ్వాస విడిచింది చిన్నారి. అల్లారు ముద్దుగా పెంచుకున్న మూడేళ్ళ కూతురు విగతజీవిగా కనిపించడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న వెంటనే పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాప ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు సాయి, లిఖితాలను ఓదార్చారు. ఈ ఘటనకు సంబంధించి ప్రమాదవశాత్తూ మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




# గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలి

■ **సంకినేని వెంకటేశ్వర రావు**

**సూర్యాపేట, విశాలభాతి:** వరంగల్ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికలో బిజెపి తరపున పోటి చేస్తున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం సూర్యాపేటలోని సంకినేని వెంకటేశ్వర రావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని మేధావులు, విద్యావంతులు బిజెపి అభ్యర్థికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టభద్రుల బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ ఎస్ నుండి గెలిచిన అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎటువంటి కారణం లేకుండా రాజీనామా చేయడం వల్లనే ఉప ఎన్నిక వచ్చిందని అన్నారు. బిఆర్ ఎస్ , కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పటికే పలు పార్టీలు మారారని, వారితో ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. తాను నలభై ఏళ్ల నుండి బిజెపిలో ఎటువంటి పదవులు లేకున్నా ప్రజల కోసం పనిచేస్తున్నానని అన్నారు. శాసనమండలిలో ప్రజల పక్షాన పోరాడతానని తెలిపారు. మోడి ప్రభుత్వం బిబినగర్ లో ఎయిమ్స్, వరంగల్ లో టెక్స్ టైల్స్ పార్క్, సమ్మక్క సారలమ్మ గిరిజన విశ్వ విద్యాలయం, ఏకలవ్య, మోడల్ స్కూల్ లు ఏర్పాటు చేసిందని అన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బొబ్బ భాగ్యరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మైనారిటీ నాయకులు హబీద్, రంగినేని లక్ష్మణ రావు, మల్లెబోయిన అంజి యాదవ్, అర్రూరి శివ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ అభ్యర్థికి టీజేఎస్ మద్దతు

■ **తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమా శంకర్**

**సూర్యాపేట, విశాలభారతి:** ఈనెల 27న జరగనున్న వరంగల్ నల్గొండ ఖమ్మం శాసనమండలి ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని తెలంగాణ జన సమితి పార్టీకి లేఖ రాసిన నేపథ్యంలో తెలంగాణ జన సమితి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాల పాలనలో విద్వంసం సృష్టించి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి చావు దెబ్బ తిని, ఎన్ని అక్రమాలకైనా పాల్పడి తన ఉనికిని చాటుకునీ తన అక్రమాల నుండి కాపాడుకోవడానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్న బి ఆర్ ఎస్ ను, ఎప్పటికప్పుడు తెలంగాణ ఏర్పాటు పై విషం కక్కుతూ పదేండ్ల పాలనలో ఏ ఒక్క విభజన హామీ నీ నెరవేర్చ నీ బిజేపి ఓడించుటకొరకు కాంగ్రెస్ పార్టీ కి మద్దతు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. పట్ట బద్రులు కాంగ్రెసు పార్టీ అభ్యర్థిని గెలిపించ వలసింది గా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ గౌడ్ లీగల్ సెల్ జిల్లా కోకన్వీనర్ వీరేష్ నాయక్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూర గోపి, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్, మన్సూర్ నాయక్ యాకోబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సైదులు కుటుంబానికి 25 కేజీల బియ్యం వితరణ

■ **నేరేడుచర్ల మండల ఐఎన్టియుసి అధ్యక్షులు నన్నెపంగ శ్రీనివాస్**

**పాలకీడు, విశాలభారతి:** నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన స్థానిక హౌస్ పెయింటర్ పంగ సైదులు కుటుంబాన్ని నేరేడుచర్ల మండల ఐఎన్టియుసి అధ్యక్షులు నన్నెపంగ శ్రీనివాస్ మంగళవారం రోజు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన హౌస్ పెయింటర్ పంగ సైదులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తూ వారికి 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల మండల ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు నన్నెపంగ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు కార్మికురాలు తప్పనిసరిగా లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని అలా లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ఉండటం వల్ల ఏదైనా జరగరాని సంఘటన జరిగినప్పుడు వారికి ఆర్థికంగా ఈ లేబర్ ఇన్స్యూరెన్స్ దోహదపడుతుంది అని నన్నపంగ శ్రీనివాస్ కార్మికులకు తెలిపారు.

# హేమంత్ సొరేన్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

**ఎన్నికల ప్రచారానికి బెయిల్ అడిగిన హేమంత్ సొరేన్**



**విశాలభారతి జార్ఖండ్:**

జార్ఖండ్ లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు జార్ఖండ్ మాజీ సీఎం హేమాంత్ సొరేన్ మధ్యంతర బెయిల్ కు సుప్రీంకోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. సుప్రీంకోర్టు బుధవారం (మే 22)న ఈ బెయిల్ పిటిషన్ తిరస్కరించింది. మనీ లాండరింగ్ కేసులో ఈడీ హేమంత్ సొరేన్ ను జనవరి 31న అరెస్ట్ చేసిన విషయం తెలిసింది. సుప్రీం కోర్టులో సొరేన్ రెండు పిటిషన్లు వేశాడు.

ఒకటి ఆయన అరెస్ట్ ను వ్యతిరేఖిస్తూ, మరొకటి ఎలక్షన్ ప్రచారంలో పాల్గొనడానికి బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరారు. మధ్యంతర బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు హేమంత్ సొరెన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. హేమంత్ సొరెన్ గవర్నమెంట్ టైంలో భూమి మార్పిడి కోసం భారీగా అవినీతి లావాదేవీలు జరిగాయి. ఆ కేసులో ఈడీ విచారణ చేపడుతున్నది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరీ చేయాలని సొరెన్ కోరారు. దీని కోసం ఆయన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కేసును ఉదాహరణగా చూపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టు అయిన కేజ్రీవాల్.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బెయిల్ తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన ఆప్ కు మద్దతు కూడా ఇస్తున్నారు.

# ఇసుకలో అప్పడాన్ని కాల్చిన జవాన్

■ **రాజస్థాన్‌లో మండుతున్న ఎండలు**

■ **ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించిన అస్సాం సీఎం**

**విశాలభారతి రాజస్థాన్:**

రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఈ సమయంలో ఒక జవాన్ ఇసుకలో అప్పడాన్ని కాల్చుతున్న వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. దీనిని షేర్ చేస్తూ.. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు.

సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాన్ ఒకరు రాజస్థాన్‌లోని బికనేర్ విధులు నిర్వర్తిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో అతడు ఒక అప్పడాన్ని తీసుకొని దానిపై ఇసుక కప్పేశారు. కొద్దిసేపటి తర్వాత, ఇసుకను తొలగించి దానిని తీసి చూస్తే.. అచ్చం స్టవ్ మీద వేయించినట్టుగా కనిపించింది. అప్పుడు ఆ ఎడారి ప్రాంతంలో ఉష్ణోగ్రత 47 డిగ్రీల మేర ఉంది. నెట్టింట్లో చక్కర్లు కొడుతోన్న ఈ వీడియో సీఎం హిమంత బిశ్వశర్మ దృష్టిలో పడింది. ''ఎలాంటి అసాధారణ పరిస్థితులకైనా వెరవకుండా, దేశం కోసం సేవలు అందిస్తోన్న జవాన్లను చూసి..నా హృదయం కృతజ్ఞత, గౌరవంతో నిండిపోయింది'' అని బీఎస్ఎఫ్ ఇండియాను ట్యాగ్ చేశారు. దీనిని చూసిన నెటిజన్లు సైనికులపై తమ కృతజ్ఞతా భావాన్ని వ్యక్తంచేస్తున్నారు. హీట్‌వేవ్‌ను పట్టించుకోకుండా



సైన్యం తన విధులు నిర్వర్తిస్తోందని కొనియాడారు. రాజస్థాన్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసే ప్రాంతాల్లో బికనేర్ కూడా ఒకటి. ఈసారి అక్కడ 46 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఐఎండీ వెల్లడించింది.

# నాకు భర్త వద్దు ఆడపడుచు కావాలి

## ప్రేమలో పడ్డ వదిన, ఆడపడుచులు



**విశాలభారతి ఉత్తరప్రదేశ్**

ప్రస్తుత సమాజంలో బంధాలకు అర్థాలు మారిపోతున్నాయి. అమ్మాయికి అమ్మాయితో, అబ్బాయికి అబ్బాయితో ఎఫైర్ ఉండటం సర్వసాధారణమైపోయింది. స్వలింగ సంపర్కుల వివాహానికి సంబంధించిన అనేక ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో అలాంటి ఉదంతం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఇక్కడ ఓ వివాహిత తన సొంత ఆడబడుచుతో ప్రేమలో పడింది. ఆమె కూడా తన వదినను ఇష్టపడటం మొదలుపెట్టింది. వీరిద్దరి మధ్య గొడవ జరగడంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు ఇద్దరికీ నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. అయితే విడిపోవడానికి ఇద్దరూ అంగీకరించలేదు. తాము కలిసి జీవిస్తామని.. కలిసి మరనిస్తామని మమ్మల్ని ఎవరూ విడదీయలేరని చెప్పారు. ఈ విషయం పోలీసుల దృష్టికి కూడా వెళ్లింది. బాలికలిద్దరికి కౌన్సిలింగ్ ఇప్పిస్తామని పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంపై ఇరువురు కుటుంబసభ్యులతోనూ చర్చించనున్నారు. ఈ సంఘటన ఆగ్రాలోని ఫతేపూర్ సిక్రీ పట్టణంలో చోటు చేసుకుంది.

# ఏసీపీ ఉమామహేశ్వరరావుకు 14 రోజుల రిమాండ్

## చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు





**విశాలభారతి హైదరాబాద్:**

హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ టి.ఎస్.ఉమామహేశ్వరరావును ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం కోర్టులో హాజరుపర్చారు. ఏసీబీ కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఉమామహేశ్వరరావును చంచల్‌గూడ జైలుకు తరలించారు.

మంగళవారం తెల్లవారుజామునే హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని ఏసీపీ ఇంటికి చేరుకున్న ఏసీబీ అధికారులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 14 చోట్ల ఏకకాలంలో మరిన్ని బృందాలు సోదాలు జరిపాయి. ఉమామహేశ్వరరావు సోదరుడితోపాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ ఇవి కొనసాగాయి. సోదాల్లో భారీగా రూ.500 నోట్ల కట్టలను, ఆభరణాలను, 17 ప్రాంతాల్లో ఉన్న స్థిరాస్తుల పత్రాలను గుర్తించారు. ఇప్పటి వరకు విశ్లేషించిన సమాచారం మేరకు ఆదాయానికి మించిన ఆస్తుల విలువ రూ.3.46 కోట్ల వరకు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రెట్టింపు ఉంటుందని భావిస్తున్నారు.

# ఆ మసాలా బ్రాండ్లలో హానికర ఆనవాళ్లు లేవు

**విశాలభారతి జాతీయం:**

దేశంలో రెండు ప్రధాన మసాలా బ్రాండ్ల శాంపిళ్లలో ఇథిలిన్ ఆక్సైడ్ ఆనవాళ్లు లేవని ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది. ఎండీహెచ్, ఎవరెస్ట్ బ్రాండ్లకు చెందిన శ్యాంపిళ్లను .. 28 ల్యాబరేటరీల్లో పరీక్షలు చేశారు. ఆ రిపోర్టును ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ రిలీజ్ చేసింది. అయితే మరో ల్యాబ్‌లకు చెందిన రిపోర్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పేర్కొన్నది. ఎండీహెచ్, ఎవరెస్ట్ బ్రాండ్ల మసాలాలు నాణ్యత లేవని హాంగ్‌కాంగ్, సింగపూర్ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ రిపోర్టును రిలీజ్ చేసింది. ఎండీహెచ్, ఎవరెస్ట్ బ్రాండ్లకు చెందిన కొన్ని మసాలా ప్యాకెట్లలో మోతాదుకు మించి ఇథిలిన్ ఆక్సైడ్ ఉన్న కారణంగా ఆ బ్రాండ్ల మసాలాలు కొనరాదు అని హాంగ్‌కాంగ్ సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్ట్ తమ దేశ పౌరులకు ఆదేశాలు ఇచ్చింది.




# సెప్టెంబర్ నుంచి కొత్త టెలికాం నిబంధనలు

- నకిలీ సిమ్ కార్డ్‌లు, సైబర్ మోసాలకు కొత్త రూల్స్
- కొత్త కనెక్షన్‌కు బయోమెట్రిక్ తప్పనిసరి



**విశాలభారతి జాతీయం:**

దేశంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత టెలికాం రంగంలో కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023లో తీసుకొచ్చిన నిబంధనలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ త్వరలో అమలు చేయనుంది. ఈ విషయంపై డాట్‌కు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా గతంలో సిఫార్సు చేసింది. ఈ మార్పులు లోక్‌సభ ఎన్నికల తర్వాత అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం.

నకిలీ సిమ్ కార్‌డ్‌లు, సైబర్ మోసాలు విజృంభిస్తున్న తరుణంలో వీటిని నిరోధించడానికి కొత్త రూల్స్ ఉపయోగపడనున్నాయి. దీని ప్రకారం.. కొత్త కనెక్షన్‌ను అందించాలంటే తప్పనిసరిగా బయోమెట్రిక్ గుర్తింపు తప్పనిసరి. అటువంటి సున్నితమైన సమాచారాన్ని సేకరించడంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా టెలికాం కంపెనీలకు స్పష్టమైన మార్గదర్శకాలు డాట్ జారీ చేయనుంది. వీటితో పాటు స్పెక్ట్రమ్ కేటాయింపులు, శాటిలైట్ కమ్యూనికేషన్‌కు సంబంధించిన నిబంధనలు తీసుకురానున్నారు. దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించాలంటే.. సదరు కంపెనీలు ప్రభుత్వం నుంచి స్పెక్ట్రమ్ కొనుగోలు చేయాల్సిఉంటుంది. టెలికమ్యూనికేషన్స్ చట్టంలోని వివిధ సెక్షన్లలో పేర్కొన్న నిబంధనలను సెప్టెంబర్ 15 నాటికి అమల్లోకి తీసుకురావాలని డాట్ లక్ష్యంగా పెట్టుకుంది.

# ఓబీసీలో పలు క్లాసులను కొట్టివేసిన హైకోర్టు

- 2010 నుంచి ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు
- హైకోర్టు తీర్పుపై మమతా బెనర్జీ అసంతృప్తి



**విశాలభారతి పశ్చిమబెంగాల్:**

పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓబీసీలో పలు క్లాసులను కొట్టివేసింది. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

2012 నాటి పశ్చిమబెంగాల్ వెనకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. 201012 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టంచేసింది.

అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసుల కింద జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లన్నింటిని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1993 నాటి వెనకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే, ఈ క్లాసులతో జారీ అయిన ఓబీసీ ధ్రువపత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు, ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దీన్ని తాము అంగీకరించబోమని తెలిపారు.






విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం,
23.05.2024
హైదరాబాద్
vishalabharathi Telugu Daily



## ‘భారతీయుడు 2’... నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్

యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం ‘ భారతీయుడు 2’. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న ఈ చిత్రం గ్రాండ్ లెవల్లో రిలీజ్ అవుతుంది. జూన్ 1న చెన్నైలో సినీ ప్రముఖులు సమక్షంలో ఆడియో వేడుకను ఘనంగా నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు. 1996లో కమల్ మాసన్, శంకర్ కాంబినేషన్ విడుదలై బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను క్రియేట్ చేసిన ‘భారతీయుడు’ చిత్రానికి సీక్వెల్‌గా ‘ భారతీయుడు 2’ రూపొందుతోంది. అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తోన్న ఈ మూవీ ప్రమోషన్స్‌లో వేగం పుంజుకున్నాయి. అందులో భాగంగా బుధవారం రోజున మేకర్స్ ‘భారతీయుడు 2’ మూవీ నుంచి ‘శౌర..’ అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. పాటలో చూపించిన కొన్ని విజువల్స్ చూస్తుంటే భారతీయుడు 2 అంచనాలను మించేలా శంకర్ తెరకెక్కించారని స్పష్టమవుతుంది. అనిరుద్ రవిచందర్ సంగీత సారథ్యంలో సుద్దాల అశోక్ తేజ రాసిన ఈ పాటను రితేష్ జి.రావ్, శ్రుతికా సముద్రాల పాడారు. కమల్ హాసన్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రవివర్మన్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఎ.శ్రీకర ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్‌గా టి.ముత్తురాజ్ గా వర్క్ చేస్తున్నారు. బి.జయమోహన్, కబిలన్ వైరముత్తు, లక్ష్మీ శరవణకుమార్‌లతో కలిసి డైరెక్టర్ శంకర్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జైంట్ మూవీస్ ఈ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. ‘భారతీయుడు 2’ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. సోనీ మ్యూజిక్ ద్వారా ‘భారతీయుడు 2’ పాటలు మార్కెట్లోకి విడుదలవుతున్నాయి.



## 'తండేల్' నుంచి అదిరిపోయే ఫోటో షేర్ చేసిన నాగ చైతన్య

నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'తండేల్'. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో అత్యంత భారీ బడ్జెట్‌తో బన్నీ వాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా హీరో నాగ చైతన్య సినిమాలోని ఒక ఫోటోని ని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ ఫోటోలో నాగ చైతన్య పల్లెటూరి గెటప్‌లో కనిపిస్తున్నారు. చొక్కా , నల్ల ప్యాంటు ధరించి, మెడలో రెడ్ టవల్ తో మ్యాసీ హెయిర్, గుబురు గడ్డం, చేతిలో తాడుతో పడవలో నిలబడి, ఆకట్టుకునే చిరునవ్వుతో మెరుస్తూ కనిపించారు నాగచైతన్య. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియా ట్రెండ్ అవుతోంది. తండేల్ లో మత్స్యకారుడి పాత్ర కోసం నాగచైతన్య ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకొని కంప్లీట్ గా మేకోవర్ అయ్యారు. తన యాసపై ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ సినిమాలో శ్రీకాకుళం స్లాంగ్‌లో డైలాగులు చెప్పనున్నారు నాగచైతన్య. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, షామ్‌దత్ డీవోపీగా పని చేస్తున్నారు. శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్.

## ‘లవ్ మీ’తో ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు ఫీల్ అవుతారు

హీరో ఆశిష్



టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య హీరో హీరోయిన్లుగా శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం ‘లవ్ మీ’. ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకత్వాన్ని వహించారు. ‘ఇఫ్ యు డేర్’ అనేది ఉప శీర్షిక. . ఈ హారర్ థ్రిల్లర్‌ను ప్రపంచ వ్యాప్తంగా మే 25న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హీరో ఆశిష్‌తో ఇంటర్వ్యూ విశేషాలు... ఇది వరకు చేసిన సినిమాలా కాకుండా లవ్ మీ చిత్రంలో డార్క్ తరహాలో నా క్యారెక్టర్ ఉంటుంది. యూనిక్ క్యారెక్టర్. ఎవరైనా ఓ పని చేయొద్దని అంటే అదే పని చేసే పాత్రలో కనిపిస్తాను. ఇందులో యూ ట్యూబర్‌గా కనిపిస్తాను. యూ ట్యూబ్‌లో స్టోరీస్ అప్‌లోడ్ చేసే హీరో దగ్గరికీ ఓ దెయ్యానికి సంబంధించిన స్టోరీ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేదే కథ. ఈ సినిమా కోసం డైరెక్టర్ అరుణ్‌తో ఎక్కువగా మాట్లాడాను. ఆయన హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారనే విషయాలను తెలుసుకున్నాను. అసలు హీరో ఏం ఆలోచిస్తున్నాడు.. ఏం చేస్తాడనేది అతని పక్కనున్న వాళ్లే ఊహించలేరు... నువ్వు నీలా ఉండు అని చెప్పే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. మా సినిమాలో దివ్యావతినే దెయ్యం పాత్రలో నటించింది. వైష్ణవి మరో హీరోయిన్‌గా కనిపిస్తారు. సినిమాలో ఐదారుగురు హీరోయిన్స్ ఉంటారు. సినిమా మొత్తంగా అందరూ కనిపించరు. చిన్న గెస్ట్ అయినా కనిపిస్తారు. ‘చంద్రముఖి’, ‘ముని’ వంటి సినిమాలు చాలానే చూశాను. ప్రతి క్యారెక్టర్‌లో ఓ సమస్య ఉంటుంది. నాదేమో సమస్యకు పరిష్కారాన్ని వెతుక్కునే పాత్ర. ఇందులో హారర్ అనేది ఓ భాగం మాత్రమే. ఇందులో మంచి లవ్ స్టోరీ కూడా ఉంటుంది. ఇదేమో రివేంజ్ స్టోరీ కాదు. ఇందులో వైష్ణవి దెయ్యం కాదు.. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లున్నాయి. ప్రేక్షకులు ‘లవ్ మీ’ సినిమా చూసిన తర్వాత ఓ కొత్త, డిఫరెంట్ మూవీ చూశామని థియేటర్ నుంచి బయటకు వస్తారు. ‘లవ్ మీ’ క్లైమాక్స్‌లో మంచి ట్విస్ట్ ఉంది.. స్టోరీ పరంగా సీక్వెల్ చేసేలా ఉంది. అయితే సీక్వెల్ చేయాలని మేం అనుకోలేదు. ఆ నిర్ణయం దిల్ రాజుగారు తీసుకోవాలి.



## సమంత పోస్ట్.. ఎవరి కోసం?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత.. త్వరలోనే ‘సిటాడెల్ హనీ బన్నీ’ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటించిన సిటాడెల్ హనీ బన్నీ సిరీస్ లో సామ్ లీడ్ రోల్ పోషించింది. అందుకోసం మార్షల్ ఆర్ట్స్ సహా ఇతర విద్యలు కూడా నేర్చుకుంది. ప్రియాంక చోప్రా సిటాడెల్ సిరీస్ కు ఇండియన్ వెర్షన్ ఇది. ఇక రీసెంట్ గా ఆమె బర్త్ డే సందర్భంగా ‘మా ఇంటి బంగారం’ అనే కొత్త మూవీ అనౌన్స్ చేసింది సమంత. పోస్టర్ కూడా విడుదల చేసింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. అయితే సామ్.. గత కొద్ది నెలలుగా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటోంది. ఎప్పటికప్పుడు ఫోటో షూట్స్ పోస్ట్ చేస్తుంటోంది. రకరకాల ఔట్ ఫిట్స్ లో సందడి చేస్తుంటోంది. అప్పుడప్పుడు హెల్త్ కు సంబంధించిన పోస్టులు కూడా పెడుతూ మోటివేట్ చేస్తోంది. సమంత లేటెస్ట్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. నువ్వు గెలవడం నేను చూడాలనుకుంటున్నానంటూ పోస్ట్ చేసింది. నీ హృదయం ఏదైతే కోరుకుంటుందో, నువ్వు ఏ ఆశలు కలిగి ఉన్నావో, నేను నీ కోసం ప్రార్థిస్తున్నా, మీరు విజయానికి అర్హులు అంటూ రాసుకొచ్చింది. దీంతో సామ్.. ఐపీఎల్ ను ఉద్దేశించే పోస్ట్ పెట్టిందని చాలా మంది భావిస్తున్నారు. ఆర్సీబీ టీమ్ కు సమంత సపోర్ట్ చేసిందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ ఐపీఎల్ సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ అద్భుతం చేసిందనే చెప్పాలి. లీగ్ దశలోనే ఇంటి బాట పడుతుందనుకున్న టీమ్.. ప్లే ఆఫ్స్ కు చేరుకుంది. దానికి ముఖ్య కారణం స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ. అన్ని మ్యాచుల్లో అద్భుతంగా ఆడారు. ఇప్పటికే అనేక సార్లు.. సమంత విరాట్ కోహ్లీపై ప్రశంసలు కూడా కురిపించిన విషయం తెలిసిందే. ఇక నేడు ఎలిమినేటర్ మ్యాచ్ లో ఆర్సీబీ, రాజస్థాన్ రాయల్స్ తలపడుతున్నాయి.ట్రాక్ అందుకే ఆర్సీబీకి సపోర్ట్ చేస్తూ.. సమంత మ్యాచ్ కు ముందు పోస్ట్ పెట్టిందని నెటిజన్లు అంటున్నారు. మరికొందరు మాత్రం ఆమె పోస్ట్ కు క్రికెట్ కు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు. ఏదో పర్సనల్ పోస్ట్ లాగానే అనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఇప్పుడు సమంత పోస్ట్ కోసమే చర్చ నడుస్తోంది. మరి దీనిపై సమంత క్లారిటీ ఇస్తే గానీ చర్చలు ఆగవు. వేచి చూడాలి సామ్ ఏమైనా స్పందిస్తుందేమో.

## పుష్ప పుష్ప.. పాట నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్

: స్టార్ సింగర్ దీపక్ బ్లూ





'ఇప్పటివరకూ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు మూడు వందలకు పైగా పాటలు పాడాను. ఇప్పుడు 'పుష్ప పుష్ప.. పాట నా కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ కావడం చాలా ఆనందంగా వుంది' అన్నారు స్టార్ సింగర్ దీపక్ బ్లూ. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాన్ ఇండియా పుష్ప 2 ది రూల్. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇటివలే ఈ చిత్రం నుంచి విడుదలై పుష్ప పుష్ప సాంగ్ సెన్సేషనల్ హిట్ అయ్యింది. ఈ చార్ట్ బస్టర్ నెంబర్ ని స్టార్ సింగర్ దీపక్ బ్లూ పాడారు. పుష్ప సాంగ్ ప్రస్తుతం టాప్ ట్రెండ్ లో కొనసాగుతున్న నేపథ్యంలో సింగర్ దీపక్ బ్లూ విలేకరుల సమావేశంలో పుష్ప పాటకు సంబధించిన ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. గత 12 ఏళ్ళుగా పాడుతున్నాను. ఇప్పటివరకూ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు మూడు వందలకు పైగా పాటలు పాడాను. ఇప్పుడు పుష్ప పాట నా కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ కావడం చాలా ఆనందంగా వుంది. మా నాన్న గారిది రేపల్లి. కానీ చెన్నైలో స్థిరపడ్డారు. అమ్మ కన్నడ. నేను పుట్టింది పెరిగింది చెన్నై. మేము ఇంట్లో తెలుగులోనే మాట్లాడుకుంటాం. ఇంట్లో అన్ని భాషల వారు వున్న కాబట్టి ఐపీఎల్ లో ఎ జట్టు గెలిచిన మాకు సమస్య లేదు. మీకు తొలి హిట్ అంటే ఏ పాటని చెబుతారు ? దేవిశ్రీ ప్రసాద్ గారి కంపోజిషన్ లో నాన్నకు ప్రేమతో లో పాడిన లవ్ దెబ్బ. అది చాలా పెద్ద హిట్ అయ్యింది. అలాగే తమన్ గారి కంపోజిషన్ లో పాడిన 'బ్రూస్లీ' మెగా మీటర్ పాట కూడా చాలా పెద్ద హిట్ అయ్యింది. తమన్ గారికి దాదాపు 35 పాటలు పాడాను. బీరువా( చెలియా చెలియా), పండగ చేస్కో( లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్) కిక్ 2, చుట్టాలబ్బాయి, డిక్టేటర్, ఇటీవల వారసుడు సినిమాలో కూడా పాడాను. తమన్ గారు నాకు బ్రదర్ లాంటి వారు. కలిసి సరదాగా క్రికెట్ కూడా ఆడుతాం. చెన్నైలో మ్యూజిషియన్స్ అంతా కలసి ఒక టీం కూడా ఏర్పాటు చేసుకున్నాం.(నవ్వుతూ). దేవిగారికి మొదట లవ్ దెబ్బ పాడాను. తర్వాత సరిలేరు నీకెవ్వరు లో ప్రమో సాంగ్ పాడాను. పుష్ప పాట కోసం ఓ పవర్ ఫుల్ వాయిస్ కోసం చూస్తున్న క్రమంలో నన్ను ఎంపిక చేశారు. ఈ పాటని చాలా ఎంజాయ్ చేస్తూ పాడాను. తెరపై చూడటానికి ఆసక్తిగా ఎదరుచూస్తున్నాను.



## "సత్యభామ" ట్రైలర్ రిలీజ్

'క్వీన్ ఆఫ్ మాసెస్' కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ లో నటిస్తున్న సినిమా “సత్యభామ”. నవీన్ చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. “మేజర్” చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు. “సత్యభామ” సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 24న హైదరాబాద్ లో నటసింహం బాలకృష్ణ చేతుల మీదుగా “సత్యభామ” సినిమా ట్రైలర్ రిలీజ్ చేయబోతున్నట్లు దర్శక నిర్మాతలు ప్రకటించారు. బాలకృష్ణ అతిథిగా వస్తుండటంతో “సత్యభామ” మూవీకి మరింత క్రేజ్ ఏర్పడటం ఖాయమని చెప్పకోవచ్చు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.


జనహృదయ నేతకు
జన్మదిన శుభాకాంక్షలు
బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి
విద్యాప్రధాత, నిత్య ప్రజా శ్రామికుడు,
అలుపెరుగని ప్రజా బాంధవుడు
రోడ్లు భవనాల మరియు
సినిమాటోగ్రఫి శాఖామాత్యులు
గా॥ శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
మర్రి నిరంజన్ రెడ్డి
ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్
మర్రి నిత్యా రెడ్డి
జెడ్పీటీసీ - మంచాల